మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

గుంటూరు - శుక్రవారం 16 అక్టోబర్ 2026 ‖ సంపుటి: 10 ‖ సంచిక: 282 ‖ పేజీలు: 8+4 ‖ వెల రూ.5

GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA | HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM

ఆసియా గేమ్స్ విజేతలతో ప్రధాని భేటీ

2

పొద్దున్నే పెండ్లి.. సాయంత్రం ఇడుపుకాయితం

2

5వ రోజు

శ్రీ లలితా త్రిపురసుందరీదేవిగా కనకదుర్గమ్మ

ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ కనకదుర్గమ్మవారు శరన్నవరాత్రి ఉత్సవాల్లో ఐదో రోజైన గురువారం శ్రీ లలితా త్రిపురసుందరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. పరాశక్తి స్వరూపిణిగా, శ్రీచక్ర అధిష్ఠానశక్తిగా పూజలందుకునే అమ్మవారి దివ్య అలంకారం భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని అందించనుంది.

ఉపాధి కేంద్రాలుగా గ్రామాలు

మహిళా శక్తికి వేదికగా సరస్ మేళా-2026

మహిళా సాధికారతే వికసిత్ భారత్కు పునాది

గ్రామీణ మహిళల ఉత్పత్తులకు 'స్వయం ఏపీ' బ్రాండ్

విజయవాడలో సరస్ మేళాను ప్రారంభించిన రాష్ట్రపతి ముర్ము, సీఎం చంద్రబాబు

2

భారత రాష్ట్రపతికి ఘనంగా వీడ్కోలు పలికిన రాష్ట్ర గవర్నరు ఎస్ అబ్దుల్ నజీర్, ఇతర ప్రముఖులు

గన్నవరం, అక్టోబర్ 15 (మనం న్యూస్): భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గురువారం మధ్యాహ్నం 2.45 గంటలకు విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో న్యూఢిల్లీకి తిరుగు ప్రయాణమయ్యారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్తో పాటు పలువురు ప్రముఖులు రాష్ట్రపతికి ఘనంగా వీడ్కోలు పలికారు. రాష్ట్రపతి రెండు రోజుల ...మిగతా 2లో

ఎన్నికలను స్వేచ్ఛగా, నిస్పక్షపాతంగా నిర్వహించాలి

28 మంది ఐఏఎస్ అధికారులను సాధారణ పరిశీలకులుగా నియమకం

రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా

విజయవాడ, అక్టోబర్ 15 (మనం ప్రతినిధి): రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న స్థానిక సంస్థల ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా సాధారణ పరిశీలకులకు సూచించారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు జిల్లాకు ఒక అధికారి చొప్పున 28 మంది మంది ఐఏఎస్ అధికారులను సాధారణ పరిశీలకులుగా నియమిస్తూ రాష్ట్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ...మిగతా 2లో

మేయర్, మున్సిపల్ చైర్మన్ అభ్యర్థులను ప్రకటించిన వైసీపీ

విజయవాడ, మనంప్రత్యేక ప్రతినిధి: స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ దూకుడు చూపిస్తోంది.. కూటమిలో సీట్ల సర్దుబాటు చివరి దశకు చేరుకోగా.. ముందుడుగు వేస్తూ పలు మున్సిపల్

కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు సంబంధించి చైర్మన్, మేయర్ అభ్యర్థులను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ పట్టణాలకు అభ్యర్థుల పేర్లను వెల్లడించింది.

కార్పొరేషన్ల అభ్యర్థులు

వైసీపీ ప్రకటించిన కార్పొరేషన్ అభ్యర్థుల్లో విశాఖపట్నం నుంచి వరుదు కళ్యాణి, ఏలూరు నుంచి గంటా మోహనరావు, మచిలీపట్నం నుంచి ...మిగతా 2లో

అభివృద్ధిని చూసి కూటమి అభ్యర్థులను ఏకగ్రీవంగా గెలిపించండి

రెండేళ్లలో పాలకొల్లుకు పెద్దఎత్తున నిధులు

- మరో మూడేళ్లలో మరింత అభివృద్ధి
- వైసిపి ఐదేళ్లలో అభివృద్ధి సున్నా
- విలేకరుల సమావేశంలో మంత్రి నిమ్మల రామానాయుడు

పాలకొల్లు, అక్టోబర్ 15(మనం ప్రతినిధి): పాలకొల్లు నియోజకవర్గంలో గత రెండేళ్లుగా రాత్రింబవళ్లు క్షణం విశ్రాంతి లేకుండా శ్రమిస్తూ పెద్దఎత్తున నిధులు తీసుకొచ్చి అభివృద్ధి పనులు చేపట్టామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. జరిగిన అభివృద్ధిని చూసి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను ఏకగ్రీవంగా గెలిపించాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. అభివృద్ధిని చూడాలే తప్ప వ్యక్తులు, పార్టీలు, కులాలు, మతాలను చూడకూడదని సూచించారు. పాలకొల్లులోని తన ...మిగతా 2లో

దసరా ఉత్సవాల్లో వైద్య సేవలకు విస్తృత ఏర్పాట్లు

దుర్గమ్మ ఉత్సవాలకు వచ్చే భక్తుల ఇబ్బందులు లేకుండా పటిష్ట చర్యలు

ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కె.వి.ఎన్. చక్రధర్బాబు

విజయవాడ, అక్టోబర్15 (మనం న్యూస్): దసరా ఉత్సవాలకు వచ్చే భక్తులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు విజయవాడ దుర్గామల్లేశ్వర స్వామి ఆలయ పరిసరాల్లో వైద్యారోగ్యశాఖ విస్తృత ఏర్పాట్లు చేసింది. ఈ ఏడాది 16 వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి, 49 మంది వైద్యాధికారులు, 30 మంది ప్రత్యేక వైద్యులు, 431 మంది పారామెడికల్ సిబ్బందిని నియమించింది. అత్యవసర సేవల కోసం 9 అంబులెన్సులను అందుబాటులో ఉంచింది. వైద్య సేవల పర్యవేక్షణ కోసం 19 సెక్టార్లను ఏర్పాటు చేసి, ఆరుగురు కార్యక్రమ అధికారులను నియమించింది. కార్యక్రమ సమన్వయ అధికారి పోస్టును కూడా కొత్తగా ఏర్పాటు చేసింది. అక్టోబరు 21 వరకు దసరా ఉత్సవాల వైద్య సేవలు కొనసాగుతాయి. ఈ వివరాలను ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కె.వి.ఎన్. చక్రధర్బాబు ఒక ప్రకటనలో వెల్లడించారు.

పెరిగిన వైద్య సేవలు

దసరా ఉత్సవాల మొదటి నాలుగు రోజుల్లో ఈ ఏడాది 31,228 మంది ...మిగతా 2లో

భారత్-అమెరికా తొలి దశ ట్రేడ్ డీల్ ఖరారు

కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయుష్ గోయల్

ఢిల్లీ, అక్టోబర్ 15: భారత్, అమెరికా మధ్య ప్రతిపాదిత ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందానికి సంబంధించిన తొలి దశ ఖరారైందని, ప్రస్తుతం దీనికి చట్టపరమైన ముసాయిదా రూపకల్పన జరుగుతోందని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ వెల్లడించారు. ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన మాటాడుతూ... అమెరికాతో వాణిజ్య ఒప్పందం మొదటి దశ పూర్తయింది. అందుకు అవసరమైన చట్టపరమైన ముసాయిదా తుది దశలో ఉంది. వీలైనంత త్వరలో ఈ ఒప్పందంపై సంతకాలు జరగనున్నాయని వాణిజ్య కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ తెలిపారు.. అమెరికా సుంకాలపై అధికారికంగా స్పష్టత వచ్చాకే.. ఈ ఒప్పందంపై ఇరు దేశాలు సంతకాలు చేయనున్నాయని వెల్లడించారు.

పండుగలు, పూజలు కేవలం ఆచారాలు కావు

మానసిక ప్రశాంతతకు, ఆలోచనల వికాసానికి ఆధ్యాత్మిక మార్గాలు

ఐదవ రోజు మహాశక్తి యాగంలో పరిపూర్ణానంద స్వామి

- శక్తి ఆరాధనతో మానసిక స్థైర్యం
- క్రమశిక్షణతో ఆధ్యాత్మిక సాధన
- సేవాభావంతో సార్థక జీవనం

కాకినాడ రూరల్, అక్టోబర్ 15(మనంన్యూస్): నవరాత్రులు అంటే కేవలం తొమ్మిది రోజుల పూజలు, యాగాలు, కుంకుమార్చనలు మాత్రమే కాదు.. మనసును దైవచింతన వైపు మళ్లించి, ఆలోచనలను ఉన్నతంగా తీర్చిదిద్దుకుని, ...మిగతా 2లో

ఆంధ్రప్రదేశ్కు 3 లక్షలకు పైగా ఇళ్ల మంజూరు

నిరుపేదలకు భరోసాగా ప్రధానమంత్రి ఆవాస్ యోజన

బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి

2

వెనకబాటుతనాన్ని బదిలీ చేయలేం

మతమార్పిడి రిజర్వేషన్లపై సుప్రీం కీలక తీర్పు

ఢిల్లీ, అక్టోబర్ 15: మతమార్పిడి రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. హిందూమతం నుంచి ఇతర మతాల్లోకి మారినవారు.. కేవలం మతమార్పిడి ఆధారంగా వెనకబడిన తరగతుల (బీసీ) కోటాను క్లెయిమ్ చేసుకోలేరని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. మతం మారినంత మాత్రాన.. ఆ వ్యక్తి సామాజిక వెనకబాటుతనాన్నీ బదిలీ చేయలేమని పేర్కొంది. ఇస్లాంలోకి మారినవారికి బీసీ రిజర్వేషన్ అర్హత లేదంటూ గతంలో మద్రాస్ హైకోర్టు తీర్పు ఇచ్చింది. దీనిని తమిళనాడు ప్రభుత్వం సవాలు చేయగా.. హైకోర్టు తీర్పునే సుప్రీంకోర్టు తాజాగా సమర్థించింది. గతంలో హిందూమతాన్ని అనుసరించిన బీసీ వ్యక్తి.. ఇస్లాంలోకి మారగానే ఆటోమెటిక్ గా రిజర్వేషన్ క్లెయిమ్ ...మిగతా 2లో

హర్మూజ్లో కుప్పలుగా తేలియాడుతున్న ఐఫోన్లు!

టెహ్రాన్, అక్టోబర్ 15: హర్మూజ్ జలసంధిలో ఓ కార్గో నౌక మునిగిపోయింది. సీమైన్ను ఢీకొనడంతో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ కోర్ వెల్లడించింది. అయితే, మైన్ను ఢీకొట్టి నౌక మునిగిపోయినట్లుగా ఐఆర్జీసీ ప్రకటించడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. చట్ట విరుద్ధమైన, ప్రమాదకర మార్గంలో నౌక ప్రయాణిస్తున్న క్రమంలో ఈ ఘటన చోటుచేసుకుందని అధికారులు చెప్పినట్లు ...మిగతా 2లో

పాకిస్థాన్

మళ్లీ సౌదీకి హ్యాండ్ ఇచ్చింది

రియాద్, అక్టోబర్ 15: ఒక చిన్న గెరిల్లా దళమైన హూతీలు సౌదీ అరేబియాపై వరుస దాడులు చేస్తూ విధ్వంసం సృష్టిస్తున్నారు. రియాద్కు నమ్మకంగా ఉన్నట్టు నటించే పాకిస్థాన్ మరోసారి ముఖం చాటేసింది. ఇన్ని దాడులు జరుగుతున్నా ఇస్లామాబాద్ ఉలుకుపలుకు లేకుండా ఉండటం గమనార్హం. ఆగస్టు 7న సౌదీ, పాకిస్థాన్, టర్కియేలు 'మక్కా ఒప్పందం' పేరిట రక్షణ ఒడంబడికను కుదుర్చుకున్నాయి. తమలో ఏ ఒక్కరిపైన దాడి జరిగినా మూడు దేశాలూ రంగంలోకి దిగుతాయని హెచ్చరించాయి. కానీ గెరిల్లాల దెబ్బకు సౌదీ విలవిలలాడుతోంది. అయినా పాక్ పట్టించుకోకపోవడం గమనార్హం.

పాకిస్థాన్కు యుద్ధంలో దిగాలనివున్నా ఇరాన్ భయం నిలువరిస్తోంది. ఇప్పటికే భారత్ ధాటికి పలు వైమానిక స్థావరాలను కోల్పోయింది. ఇరాన్తోనూ పాకిస్థాన్కు సుదీర్ఘమైన సరిహద్దు ఉంది. మరోపక్క తాలిబన్ల సర్కార్తో పోరు సాగిస్తోంది. యెమెన్లో ఎలాంటి సైనిక చర్యలో పాల్గొన్నా.. ఇరాన్ ...మిగతా 2లో

అది హిందూ వ్యతిరేక ఘటనే

అమెరికాలో ఆలయంపై దాడిపై భారత్ స్పందన

ఢిల్లీ, అక్టోబర్ 15: అమెరికాలో హిందూ ఆలయంలో కాల్పులకు కుట్రపన్నిన ఘటనపై భారత ప్రభుత్వం స్పందించింది. అది పూర్తిగా హిందూ వ్యతిరేక ఘటన అని ఆందోళన వ్యక్తంచేసింది. ఈ కుట్ర కేసుపై విదేశాంగశాఖ ప్రతినిధి రణధీర్ జయస్వాల్ మీడియాతో మాట్లాడారు. 'ఇల్లినోయిలోని అరోరా శివారు ప్రాంతంలోని హిందూ ఆలయాన్ని లక్ష్యంగా చేసుకొని కాల్పుల కుట్రకు సంబంధించిన నివేదికలు మా దృష్టికి వచ్చాయి. ఆ కుట్ర ఘటన తీవ్ర కలవరానికి గురిచేసింది. దాని వెనక జాతి వివక్ష, హిందూ వ్యతిరేక స్వభావం ఉన్నట్లు తెలుస్తోంది. భారతీయుల భద్రతకు తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది' అని జైస్వాల్ పేర్కొన్నారు. రైఫిల్ జామ్ అవడంతో ఆగిన నరమేధం.. భారతీయులను లక్ష్యంగా చేసుకుని కాల్పులు జరిపే ఉద్దేశంతో ...మిగతా 2లో

కుప్పకూలిన పాఠశాల పైకప్పు..

34 మంది విద్యార్థులు మృతి

పెషావర్, అక్టోబర్ 15: పాకిస్థాన్లో విషాద ఘటన చోటుచేసుకుంది. ఓ ప్రైవేటు పాఠశాల పైకప్పు కూలి 34 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో అత్యధికులు 13 ఏళ్ల లోపు వయసున్న విద్యార్థులే కావడం విషాదకరం. పెషావర్లో గురువారం ఈ ఘటన చోటుచేసుకుంది. ఉదయం పూట తరగతులు జరుగుతుండగా ...మిగతా 2లో

దసరా ఉత్సవాల్లో వైద్య సేవలకు విస్తృత ఏర్పాట్లు

(మొదటి పేజీ తరువాయి)

వైద్య సేవలు పొందారు. ఎన్టీఆర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎ. శ్రవణబాబు, సీనియర్ అధికారి డాక్టర్ జె. ఇందుమతి దేవీరావు క్షేత్రస్థాయిలో భక్తులకు అందుతున్న వైద్య సేవలను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు.

సరస్ మేళాలోనూ ప్రత్యేక వైద్య సేవలు

సరస్ మేళా సందర్భంగా అక్టోబరు 31 వరకు ప్రత్యేక వైద్య ఏర్పాట్లు చేశారు. మొత్తం నాలుగు వైద్య శిబిరాల ద్వారా సేవలు అందిస్తున్నారు.

అత్యవసర వైద్య సేవల కోసం ఐదు పడకల చికిత్స కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రథమ రిఫరల్ వైద్యశాలగా భవానీపురం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గుర్తించారు. విజయవాడ ఉత్సవాల కోసం ప్రత్యేక వైద్య శిబిరాన్ని, ఉన్నత స్థాయి వైద్య సేవల కోసం విజయవాడ ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ప్రత్యేక రిఫరల్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాల కోసం 15 మంది వైద్యాధికారులు, ఐదుగురు ప్రత్యేక వైద్యులు, 85 మంది పారామెడికల్ సిబ్బందిని నియమించారు. అత్యవసర సేవల కోసం 108 అంబులెన్సులను నాలుగు ప్రాంతాల్లో సిద్ధంగా ఉంచినట్లు ప్రజారోగ్య సంచాలకులు డాక్టర్ ఆర్. వెంకటరమణ తెలిపారు.

వెనకబాటుతనాన్ని బదిలీ చేయలేం

(మొదటి పేజీ తరువాయి)

చేసుకోవడానికి వీల్లేదని సుప్రీంకోర్టు తాజాగా స్పష్టం చేసింది. ఆ వ్యక్తి సామాజికంగా, విద్యాపరంగా అదే వెనకబాటుతనాన్ని ఎదుర్కొంటున్నట్లు చట్టబద్ధంగా నిరూపితమైనే.. రాష్ట్ర ప్రభుత్వం నోటిపై చేసిన కమ్యూనిటీ పరిధిలోకి వస్తేనే రిజర్వేషన్ వర్తిస్తుందని పేర్కొంది. హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదని అత్యున్నత న్యాయస్థానం వెల్లడించింది.

భారత రాష్ట్రపతికి ఘనంగా వీడ్కోలు పలికిన రాష్ట్ర గవర్నరు ఎస్ అబ్దుల్ నజీర్, ఇతర ప్రముఖులు

(మొదటి పేజీ తరువాయి)

పాటు ఎన్టీఆర్ జిల్లా విజయవాడలో పర్యటించి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పర్యటన ముగించుకుని న్యూఢిల్లీకి తిరుగు ప్రయాణమైన రాష్ట్రపతికి విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయంలో రాష్ట్ర గవర్నర్ తో పాటు కేంద్ర వ్యవసాయ, రైతుల సంక్షేమం, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి కమలేష్ పాశ్వాన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హోం, విపత్తు నిర్వహణ మంత్రి వంగలపూడి అనిత, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్, రాష్ట్ర డిజిపి హరీష్ కుమార్ గుప్తా, 4(ఏ), గరల్స్ ఎన్సిసి బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ ప్రవీణ్ యాదవ్, కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజి, జిల్లా ఎస్పీ వి. విద్యా సాగర్ నాయుడు భారత రాష్ట్రపతికి ఘనంగా వీడ్కోలు పలికారు.

మేయర్, మున్సిపల్ చైర్మన్ అభ్యర్థులను ప్రకటించిన వైసీపీ

(మొదటి పేజీ తరువాయి)

లంకా జ్యోతి, కడప నుంచి దీప్తి రెడ్డి ఉన్నారు. కర్నూలు నుంచి ఎం. సుశీల, నెల్లూరు నుంచి ఆనం విజయ్కుమార్రెడ్డి, ఒంగోలు నుంచి కుప్పం ప్రసాద్, విజయనగరం నుంచి కోలగట్ల శ్రావణిని అభ్యర్థులుగా ప్రకటించింది

మున్సిపాలిటీల అభ్యర్థులు

మున్సిపాలిటీలకు సంబంధించి ఇచ్ఛాపురం నుంచి పిలక రాజ్యలక్ష్మి, పలాస నుంచి శ్రీపద్మ, నర్సీపట్నం నుంచి చింతకాయల అనిత, యలమంచిలి నుంచి బుడ్డపు తులసి, తుని నుంచి రామతులసిని వైసీపీ ప్రకటించింది. కొవ్వూరు నుంచి మన్నే పద్మ, రామచంద్రాపురం నుంచి చింతపల్లి నాగేశ్వరరావు, కొండపల్లి నుంచి నల్లమోతు తేజస్వి, తెనాలి నుంచి మద్దాలి శేషాచలం, చీరాల నుంచి ఇస్తర్ల షేర్లీ పేర్లను వెల్లడించింది. అలాగే బద్వేలు నుంచి రాచపూడి వెంకట సాయికృష్ణ, ప్రొద్దుటూరు నుంచి పొరెడ్డి నరసింహారెడ్డి, పులివెందుల నుంచి వైఎస్ ప్రమీలమ్మ, మదనపల్లి నుంచి జింకా చలపతిని అభ్యర్థులుగా ప్రకటించింది.

నగర పంచాయతీల అభ్యర్థులు..

నగర పంచాయతీలకు సంబంధించి ఏలేశ్వరం నుంచి బాదిరెడ్డి ఆశాలత, ఉయ్యూరు నుంచి పైడిముక్కల దివ్య, గురజాల నుంచి పోలు వీరారెడ్డి, కనిగిరి నుంచి పులి శాంతిరెడ్డిని వైసీపీ ఎంపిక చేసింది. బుచ్చిరెడ్డిపాలెం నుంచి షేక్ షకీలా బేగం, కమలాపురం నుంచి మర్జుల కవిత పేర్లను ప్రకటించింది. మొత్తంగా ఈ ప్రకటనతో రాష్ట్రంలోని పలు పట్టణాల్లో వైసీపీ తరపున పోటీ చేయనున్న అభ్యర్థుల వివరాలు వెల్లడయ్యాయి. ఆయా స్థానాల్లో ఎన్నికల ప్రక్రియ, అభ్యర్థుల ప్రచారంపై తదుపరి పరిణామాలు ఆసక్తికరంగా మారనున్నాయి.

మానసిక ప్రశాంతతకు, ఆలోచనల వికాసానికి ఆధ్యాత్మిక మార్గాలు

(మొదటి పేజీ తరువాయి)

జీవితాన్ని సార్థకంగా మలుచుకునే ఆధ్యాత్మిక సాధన అని పరిపూర్ణానంద స్వామి పేర్కొన్నారు. కాకినాడ శ్రీ పీఠంలో జరుగుతున్న 'మహాశక్తి యాగం' కార్యక్రమం గురువారం కూడా ఎంతో ఘనంగా జరిగింది. శ్రీపీఠంలో వేంచేసియున్న ఐశ్వర్యంబికా అమ్మవారు శ్రీ రాజరాజేశ్వరి దేవిగా దర్శనం ఇచ్చారు. ఐదవ రోజు కూడా భారీ సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీ పరిపూర్ణానంద స్వామి వారు మాట్లాడుతూ మనిషి తన కాలాన్ని, శక్తిని, ఆలోచనలను దైవంపై కేంద్రీకరించి చేసే ఆరాధన వ్యక్తిగత ప్రశాంతతతో పాటు సేవాభావాన్ని, క్రమశిక్షణను పెంపొందిస్తుందని వివరించారు. పండుగల ప్రాధాన్యం, మానసిక స్థైర్యం, యాత్రల వెనుక ఉన్న ఆధ్యాత్మిక ఉద్దేశం, ఆహారపు అలవాట్లు, ఆలోచనల శక్తి, సమాజం పట్ల బాధ్యత వంటి అంశాలను విశదీకరించారు.

మానసిక ప్రశాంతతకు ఆధ్యాత్మిక సాధన..

భారతీయ సంప్రదాయంలో ప్రతి నెలా ఏదో ఒక పండుగ, వ్రతం, పూజ లేదా ఆధ్యాత్మిక కార్యక్రమం ఉండేలా మన పూర్వీకులు ఏర్పాటు చేశారని స్వామి వివరించారు. భాద్రపద మాసంలో వినాయక నవరాత్రులు, ఆశ్వయుజ మాసంలో దేవీ నవరాత్రులు, కార్తీక మాసంలో శివారాధన, ధనుర్మాసంలో విష్ణు ఆరాధన, మాఘమాసంలో శివరాత్రి, చైత్ర మాసంలో

ఉగాది, శ్రీరామనవమి, ఆషాఢంలో గురుపూర్ణిమ వంటి పర్వదినాలు మనిషిని నిరంతరం ఆధ్యాత్మిక మార్గంలో నడిపిస్తాయని తెలిపారు.దైనందిన జీవితంలో పని ఒత్తిళ్లు, ఆందోళనలు, అనేక రకాల ఆలోచనల మధ్య సతమతమయ్యే మనిషికి పండుగలు, పూజలు, వ్రతాలు మనసును ఒక దిశగా కేంద్రీకరించుకునే అవకాశాన్ని కల్పిస్తాయని చెప్పారు. శరీరంపై వైరస్లు, బ్యాక్టీరియా ప్రభావం చూపినట్లే, చుట్టూ ఉండే పరిస్థితులు, అనుభవాలు, ఆలోచనలు మనసుపైనా ప్రభావం చూపుతాయని వివరించారు. దైవచింతన, జపం, ధ్యానం, నియమబద్ధమైన జీవనం మనసుకు ప్రశాంతతను అందించడంలో తోడ్పడతాయని పేర్కొన్నారు.

ఆన్లైన్లో అవకాశం...

యాగ ప్రాంగణానికి నేరుగా రాలేని భక్తులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు కూడా అమ్మవారి అనుగ్రహాన్ని పొందేలా శ్రీపీఠం యూట్యూబ్ ఛానల్ ద్వారా ప్రత్యక్ష ప్రసారాన్ని అందిస్తున్నట్లు స్వామి తెలిపారు. ఛానల్ లింక్ను తమ వాట్సాప్ స్టేటస్లు, గ్రూపులు, ఇతర సామాజిక మాధ్యమాల ద్వారా బంధుమిత్రులతో పంచుకోవాలని కోరారు.

అలాగే యాగ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన గౌదర్చార్ ఉత్పత్తుల స్టాల్ను సందర్శించాలని సూచించారు. ధూపం, దీపం కోసం నెల రోజులపాటు వినియోగించుకునేలా ప్రత్యేకంగా రూపొందించిన కిట్తో పాటు అందుబాటులో ఉన్న ఉత్పత్తులను భక్తులు పరిశీలించవచ్చని తెలిపారు. నవరాత్రుల్లో ఇప్పటికే ఐదు రోజులు గడిచాయని, రాబోయే సప్తమి, అష్టమి, నవమి, విజయదశమి రోజుల్లో మరిన్ని విశేష కార్యక్రమాలు ఉన్నాయని స్వామి గుర్తుచేశారు. యాగంలో పాల్గొనే ప్రతి ఒక్కరూ క్రమశిక్షణ, ఓర్పు, ఏకాగ్రత, సేవాభావంతో మిగిలిన రోజులను కూడా పూర్తి చేయాలని పిలుపునిచ్చారు. పండుగలు మనల్ని మనం మలుచుకునేందుకు, మనసును ఉన్నతంగా తీర్చిదిద్దుకునేందుకు, ఇతరులకు ఉపయోగపడే జీవన విధానాన్ని అలవర్చుకునేందుకు లభించే అవకాశాలని, అమ్మవారి ఆరాధనను కేవలం ఆచారంగా కాకుండా జీవితంలో సానుకూల మార్పుకు మార్గంగా స్వీకరించాలని సూచించారు.

మంత్రపారాయణంపై ఏకాగ్రత పెంచుకోవాలి

కుంకుమార్చనలో భాగంగా లలితా సహస్రనామ పారాయణం చేసే సమయంలో అక్షరాలను చదవడానికే పరిమితం కాకుండా, ప్రతి నామంపై మనసును కేంద్రీకరించాలని స్వామి సూచించారు. ప్రవచనాన్ని శ్రద్ధగా వింటున్నట్లే మంత్రపారాయణం చేస్తున్నప్పుడు మరింత ఏకాగ్రతతో ఉండాలని చెప్పారు. మంత్రంపై మనసు నిలిపితే మనలోని ఆలోచనలను పరిశీలించుకునే అవకాశం కలుగుతుంది. మననం ద్వారా మనసును ఒక దిశగా నడిపించుకోవచ్చు అనే భావాన్ని వివరించారు. పూజలో పాల్గొనడం అంటే కేవలం ఒక ఆచారాన్ని పూర్తి చేయడం కాదని, మనసును ప్రశాంతంగా ఉంచుకుంటూ ఆధ్యాత్మిక సాధనలో నిమగ్నమవడమని పేర్కొన్నారు.

ఎన్నికలను స్వేచ్ఛగా, నిస్పక్షపాతంగా నిర్వహించాలి

(మొదటి పేజీ తరువాయి)

గురువారం నిర్వహించిన సమావేశంలో ఎన్నికల నిర్వహణకు సంబంధించి పరిశీలకులకు ఆయన పలు సూచనలు చేశారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచే ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిందని ఎన్నికల కమిషనర్ తెలిపారు. సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో అనుసరించే విధానాలను స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ పాటించాలని, రాజకీయ ప్రతినిధులు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించకుండా పరిశీలకులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించే ఘటనలపై అప్రమత్తంగా ఉంటూ, నిబంధనల అమలుకు తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

ఎన్నికల నిర్వహణను మరింత సులభతరం చేసేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం పోల్ మేనేజ్మెంట్ యాప్ను రూపొందించిందని అనిల్ చంద్ర పునేఠా తెలిపారు. ఈ యాప్ ద్వారా ఓటర్ల నిర్వహణ, పోలింగ్ కేంద్రాల వివరాలు, ఎన్నికల నిర్వహణ విధానాలు తదితర సమాచారాన్ని అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణలో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలని పరిశీలకులకు సూచించారు.

ఎన్నికల సమయంలో శాంతిభద్రతల పరిరక్షణకు జిల్లా పోలీసు యంత్రాంగంతో సమన్వయం చేసుకుంటూ పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల నుంచి ఓటు హక్కును వినియోగించుకునే సామాన్య పౌరుల వరకు అందరికీ భద్రత కల్పించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికలు అత్యంత కీలకమైనవని పేర్కొన్న కమిషనర్, ప్రతి ఓటరు ఎలాంటి ఒత్తిళ్లు, ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛగా తన ఓటు హక్కును వినియోగించుకునే వాతావరణాన్ని కల్పించాలని సూచించారు. ఈ లక్ష్య సాధనలో జిల్లా స్థాయి నుంచి జోనల్ స్థాయి వరకు ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులకు తగిన మార్గదర్శకత్వం అందించడం, ఎన్నికల ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించడం సాధారణ పరిశీలకుల బాధ్యత అని అనిల్ చంద్ర పునేఠా స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరిగేలా సంబంధిత అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు.

అభివృద్ధిని చూసి కూటమి అభ్యర్థులను ఏకగ్రీవంగా గెలిపించండి

(మొదటి పేజీ తరువాయి)

కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులు, మంజూరైన నిధుల వివరాలను వెల్లడించారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే పాలకొల్లులో అభివృద్ధి జరిగిందని, తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పనులు వేగవంతమయ్యాయని మంత్రి పేర్కొన్నారు. గత వైకాపా ఐదేళ్ల పాలనలో అభివృద్ధి శూన్యమని విమర్శించారు. గత టిడిపి ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి సైతం గత ప్రభుత్వం విధ్వంసం చేసింది అన్నారు. పార్కులను అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. బ్రాడీపేట మంచినీటి చెరువు, ప్రభుత్వ ఆసుపత్రి సమీపంతోపాటు 27వ వార్డు లజపతిరాయ్పేట, 12వ వార్డు డంపింగ్ యార్డు ప్రాంతం, 25వ వార్డు ఏవీఎస్ కాలనీ, టిడ్కో గృహాల కాలనీలో పార్కులను అభివృద్ధి చేయనున్నట్లు వివరించారు.నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలు గమనించాలని, రాబోయే రోజుల్లో మరిన్ని మౌలిక సదుపాయాలు కల్పించేలా కృషి చేస్తానని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. సమావేశంలో కూటమి నాయకులు పాల్గొన్నారు . సమావేశంలో కూటమి నాయకులు పాముల రజనీ కుమార్, గొట్టుముక్కల సూర్యనారాయణ రాజు, మామిడి శెట్టి పెద్దిరాజు, బోనం చినబాబు, బోనం నాని ,తులా రామలింగేశ్వరరావు, జత్తుగా రీనా, పి .రాంబద్ర రాజు, చిలుకూరి బాలాజీ,దాసరి రత్నం రాజు, మాత రత్నరాజు, ఆరుమిల్లి చిన్ని, రుద్రరాజు సత్యనారాయణ రాజు, తాళ్ల నాగరాజు, పీతల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఆసియా గేమ్స్ విజేతలతో ప్రధాని భేటీ

ఢిల్లీ, అక్టోబర్ 15: ఆసియా క్రీడల పతక విజేతలతో భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ సంభాషించారు. తన నివాసంలో అథ్లెట్లతో భేటీ అయిన ప్రధాని వారిని అభినందించారు. స్వర్ణాలు గెలిచిన భారత హాకీ, క్రికెట్ పురుష, మహిళా జట్లతోపాటు ప్రతి అథ్లెట్ తో మోడీ ఫొటోలు దిగారు. జపాన్ వేదికగా జరిగిన ఆసియా క్రీడల్లో భారత్ 85 పతకాలను గెలిచి తన నాలుగో స్థానాన్ని కాపాడుకుంది. ఇందులో 21 బంగారు, 27 రజత, 37 కాంస్య పతకాలు ఉన్నాయి.

పొద్దున్నే పెండి.. సాయంత్రం

ఇడుపుకాయితం

కన్యాకుమారి, అక్టోబర్ 15: కొత్తగా పెళ్లి చేసుకున్న ఓ జంట రోజైనా గడవకముందే విడిపోయిన ఘటన తమిళనాడులో చోటుచేసుకుంది. కన్యాకుమారి జిల్లా కుళచ్చల్కి చెందిన 31ఏళ్ల వయసున్న ఓ సైనికుడు, కన్యాకుమారి-కేరళం సరిహద్దు ప్రాంతమైన పారసాలై ప్రాంతానికి చెందిన 26ఏళ్ల యువతి నాలుగేళ్లుగా ప్రేమించుకున్నారు. యువతి తిరువనంతపురంలోని ఓ ప్రముఖ ప్రైవేటు ఆస్పత్రిలో ఫార్మసిస్టుగా పనిచేస్తోంది. ఇదిలా ఉండగా పెద్దల అంగీకారంతో గత సోమవారం ఇద్దరి వివాహం జరిగింది. సాయంత్రం వివాహ రిసెప్షన్ ఏర్పాటు చేశారు. అప్పుడు మద్యం మత్తులో ఉన్న వరుడు.. వధువు తండ్రితో గొడవపడ్డాడు. మామ, అడ్డొచ్చిన భార్యపై చేయి చేసుకొని వెళ్లిపోయాడు. అనంతరం తండ్రీకూతుళ్లు కుళచ్చల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. తర్వాత భర్తతో తెగదెంపులు చేసి కుమార్తెను తమ ఇంటికి తీసుకెళ్లారు.

అమెరికాలో ఆలయంపై దాడిపై భారత్ స్పందన

(మొదటి పేజీ తరువాయి)

నిందితుడు అలెగ్జాండ్రోస్ పపోరాకిస్ ఆలయానికి వెళ్లినట్లు పోలీసులు దర్యాప్తులో అధికారులు గుర్తించారు. అయితే, రైఫిల్ జామ్ అవడంతో కుట్ర విఫలమైనట్లు పేర్కొన్నారు. రెస్టారంట్లో తనతో పాటు పనిచేసే ఓ ఫ్రెండ్ కు ఫోన్ చేసి కాల్పులు జరపాలనుకున్న విషయాన్ని, తుపాకీ జామ్ అయిన సంగతిని చెప్పడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది.

34 మంది విద్యార్థులు మృతి

(మొదటి పేజీ తరువాయి)

పాఠశాల భవనం పైకప్పు ఒక్కసారిగా కూలిపోయింది. సమాచారం అందుకున్న సహాయక బృందాలు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. ఈ దుర్ఘటనలో 34 మంది విద్యార్థులతో పాటు ఓ ఉపాధ్యాయురాలు కూడా మరణించినట్లు స్థానిక అధికారులు వెల్లడించారు. మరో 40 మందికిపైగా గాయపడ్డారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. ప్రమాదం నేపథ్యంలో పాఠశాల యజమానిని పోలీసులు అరెస్టు చేశారు. ఘటనపై పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

ఆంధ్రప్రదేశ్కు 3 లక్షలకు పైగా ఇళ్ల మంజూరు

మార్కాపురం,అక్టోబర్,15,(మనం న్యూస్): దేశవ్యాప్తంగా సొంత ఇల్లు లేని నిరుపేదలకు పక్కా గృహాలను అందించడమే లక్ష్యంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ఆవాస్ యోజనను సమర్థవంతంగా అమలు చేస్తోందని బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి తెలిపారు. పేదల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ, ప్రతి కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. 2024లో కేంద్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన అనంతరం ఆంధ్రప్రదేశ్కు 3 లక్షలకు పైగా ఇళ్లను మంజూరు చేయడం రాష్ట్రంలోని నిరుపేద కుటుంబాలకు ఎంతో ప్రయోజనకరమని ఆయన అన్నారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది పేద కుటుంబాలకు పక్కా ఇళ్లను అందించి వారి జీవితాల్లో వెలుగులు నింపుతుందని తెలిపారు. దశాబ్దాలుగా సొంత ఇల్లు లేక ఇబ్బందులు పడుతున్న నిరుపేద కుటుంబాలకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన ఆశాకిరణంగా నిలుస్తోందని డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. కేవలం నివాసాన్ని కల్పించడమే కాకుండా,

పేదలకు భద్రత, ఆత్మగౌరవం, స్థిరమైన జీవనానికి ఈ పథకం భరోసా ఇస్తోందని కొనియాడారు. ప్రతి పేద కుటుంబానికి సురక్షితమైన నివాసం ఉండాలనే సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలు సామాజిక, ఆర్థిక అభివృద్ధికి దోహదపడుతున్నాయని ఆయన తెలిపారు. పేదల సంక్షేమమే లక్ష్యంగా మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు దేశవ్యాప్తంగా అర్హులైన కుటుంబాల జీవితాల్లో సానుకూల మార్పులు తీసుకొస్తున్నాయని అన్నారు.

హర్మూజ్లో కుప్పలుగా తేలియాడుతున్న ఐఫోన్లు!

(మొదటి పేజీ తరువాయి)

స్థానిక మీడియా పేర్కొంది. ప్రమాదానికి గురైన నౌక దాదాపు 2500 కంటైనర్లతో వెళ్తున్నట్లు సమాచారం. వీటిలో ఐఫోన్లు, లగ్జరీ పెర్ఫ్యూమ్ బాటిళ్లు, తదితర వస్తువులున్నాయి. ప్రమాదం అనంతరం కంటైనర్లు చెల్లాచెదురు కాగా అందులోని ఐఫోన్లు సహా ఇతర వస్తువులు కుప్పలుగా నీటిపై తేలియాడుతున్న దృశ్యాలు కనిపించాయి. జీఏఫ్ఎస్ ప్రైడ్ అనే సింగపూర్ జెండా ఉన్న నౌక దుబాయ్ నుంచి ఈ సరకులను తీసుకువెళ్తున్నట్లు తెలుస్తోంది.హర్మూజ్ మార్గంలో వెళ్తున్న సమయంలో సింగపూర్కు చెందిన రెండు సరకు రవాణా నౌకలు గుర్తు తెలియని వస్తువులను ఢీకొన్నా యని నౌకాశ్రయ అధికారులు తొలుత పేర్కొన్నారు. ఇందులో ఒకటి మునిగిపోగా.. మరొకటి సురక్షితంగా గమ్యాన్ని చేరుకున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో మొదటి నౌకలోని సిబ్బంది అందర్నీ సురక్షితంగా తరలించామని, ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదని సింగపూర్ పోర్టు అధికారులు వెల్లడించారు.

ఉపాధి కేంద్రాలుగా గ్రామాలు

విజయవాడ, అక్టోబర్ 15 (మనం బ్యూరో చీఫ్): గ్రామీణ మహిళలు తయారు చేసే ఉత్పత్తులకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చేందుకు స్వయం ఏపీ బ్రాండ్ను అందుబాటులోకి తెచ్చినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. మహిళలను కేవలం సంక్షేమ పథకాల లబ్ధిదారులుగా కాకుండా సంపద సృష్టికర్తలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఏడాది కాలంలో లక్ష మంది స్వయం సహాయక సంఘాల సభ్యులు మహిళా పారిశ్రామికవేత్తలుగా ఎదిగారని, మరో ఐదు లక్షల మందిని ఆ దిశగా తీర్చిదిద్దుతామని ప్రకటించారు. విజయవాడలో తొలిసారిగా నిర్వహిస్తున్న జాతీయ సరస్ మేళా-2026ను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభించడంపై ఆయన కృతజ్ఞతలు తెలిపారు. దసరా శరన్నవరాత్రుల వేళ జాతీయ సరస్ మేళా నిర్వహించడం విజయవాడకు మరింత శోభ తెచ్చిందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జీవితం ప్రతి ఆడబిడ్డకు స్ఫూర్తిదాయకమని చెప్పారు. మారుమూల గిరిజన ప్రాంతంలో జన్మించి ఉపాధ్యాయురాలిగా ప్రస్థానం ప్రారంభించిన ఆమె.. ఎన్నో సవాళ్లను అధిగమించి దేశ అత్యున్నత రాజ్యాంగ పదవిని అధిరోహించారని కొనియాడారు. సంకల్ప బలం, ధైర్యం ఉంటే మహిళలు ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని ఆమె నిరూపించారని తెలిపారు. జాతీయ సరస్ మేళాలో 650 స్వయం సహాయక సంఘాలు పాల్గొంటున్నాయని సీఎం తెలిపారు. ఇది కేవలం 14 రోజులపాటు జరిగే ప్రదర్శన కాదని, గ్రామీణ మహిళల ఉత్పత్తులకు ఏడాది పొడవునా మార్కెట్ అవకాశాలు కల్పించే దిశగా అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. మహిళల ఆదాయాన్ని పెంచడం, మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడం, గ్రామీణ ఉత్పత్తులకు జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడం మేళా ప్రధాన ఉద్దేశమని వివరించారు. దేశంలోని వివిధ ప్రాంతాల మహిళలు తమ అనుభవాలను పంచుకోవడంతోపాటు విజయగాథలను తెలుసుకోవాలని, కొత్త వ్యాపార అవకాశాలను అన్వేషించాలని సూచించారు.

రూ.69 వేల కోట్ల టర్నోవర్తో డ్వాక్రా సంఘాలు

ఆంధ్రప్రదేశ్లో 11 లక్షల స్వయం సహాయక సంఘాలు, 1.10 కోట్ల మంది సభ్యులు ఉన్నారని చంద్రబాబు తెలిపారు. ఈ సంఘాల ద్వారా రూ.69 వేల కోట్ల టర్నోవర్ నమోదవుతోందని పేర్కొన్నారు. రాష్ట్రంలో స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులు 3.5 కోట్ల మందికి చేరుతున్నాయని వివరించారు. గతంలో వెలుగు కార్యక్రమం ద్వారా మహిళలు సంపద సృష్టించే దిశగా అడుగులు వేశారని గుర్తుచేశారు. నిన్నటి వరకు పొదుపు సంఘాలుగా ఉన్న ఎస్ హెచ్ జీలు నేడు వ్యాపార సంస్థలుగా ఎదుగుతున్నాయని..

భవిష్యత్తులో అంతర్జాతీయ బ్రాండ్లుగా మారాలని సీఎం ఆకాంక్షించారు. మహిళలు ఉద్యోగాలు కోరుకునే స్థాయి నుంచి ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. గ్రామీణ మహిళలు తయారు చేసే ఉత్పత్తులను ఈ-కామర్స్, ఆన్లైన్ షాపింగ్ వేదికల ద్వారా స్వయం ఏపీ పేరుతో మార్కెటింగ్ చేస్తామని తెలిపారు. వాట్సప్, ఇన్స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాలను వ్యాపార అభివృద్ధికి వినియోగించుకోవాలని సూచించారు. గ్రామీణ మార్కెట్ల నుంచి ప్రపంచ మార్కెట్ల వరకు మహిళల ఉత్పత్తులు చేరేలా సరఫరా వ్యవస్థను బలోపేతం చేయాలని చెప్పారు. మహిళల సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో వినియోగించు కున్నప్పుడే వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకోగలమని స్పష్టం చేశారు. మహిళలను గౌరవించడం, వారి ఆలోచనలకు విలువ ఇవ్వడం, కలలను సాకారం చేసుకునేందుకు అవసరమైన అవకాశాలు, సహకారం అందించడం సమాజ బాధ్యత అని అన్నారు.

ప్రతి గ్రామం ఉపాధి కేంద్రంగా ఎదగాలి

సంక్షేమ పథకాలతో మహిళలకు భరోసా కల్పిస్తూనే, ఆర్థిక స్వావలంబన సాధించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చంద్రబాబు తెలిపారు. తల్లికి వందనం పథకంతో పిల్లల చదువుకు అండగా నిలుస్తున్నామని, దీపం పథకంతో మహిళల ఖర్చులను తగ్గిస్తున్నామని చెప్పారు. స్త్రీశక్తి ఉచిత బస్సు ప్రయాణ పథకం ద్వారా మహిళలు ఇప్పటివరకు 100 కోట్ల ప్రయాణాలు చేశారని వెల్లడించారు. మహిళల పేరుతో ఇళ్ల పట్టాలు సహా పలు ప్రయోజనాలు అందిస్తున్నామని తెలిపారు. సంక్షేమం నుంచి అభివృద్ధి, ఆర్థిక స్వావలంబన దిశగా మహిళలను ముందుకు తీసుకెళ్లడమే ప్రభుత్వ విధానమని వివరించారు. ప్రతి స్వయం సహాయక సంఘం ఒక చిన్న ఆర్థిక శక్తిగా, ప్రతి మహిళ

స్థానిక సమరానికి సర్వం సిద్ధం!

- 11.35 లక్షల ఓటర్లు.. 467 పంచాయతీలు..
- ఎన్నికలపై కలెక్టర్, ఎస్పీ కీలక ప్రకటన

పుట్టపర్తి, అక్టోబర్ 15 మనం న్యూస్ః రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను నిష్పాక్షికంగా, ప్రశాంత వాతావరణంలో, పూర్తి పారదర్శకతతో నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం, పోలీస్ శాఖ సమగ్ర ఏర్పాట్లు చేపడుతున్నాయని శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్, జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ తెలిపారు. గురువారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు ఎన్నికల సంసిద్ధత, భద్రతా ఏర్పాట్లు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుపై వివరించారు. జిల్లాలో మొత్తం 11,35,917 మంది ఓటర్లు ఉన్నారని అధికారులు వెల్లడించారు. గత ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి రూపొందించిన ముసాయిదా ఓటర్ల జాబితా ఆధారంగా ఎన్నికల ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో భాగంగా ప్రభుత్వానికి సంబంధించిన ప్రచార పోస్టర్ల తొలగింపు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారం, ప్రకటనలు, బహిరంగ కార్యక్రమాల నిర్వహణకు సంబంధిత ఎంపీడీవో లేదా మున్సిపల్ కమిషనర్ నుంచి నిబంధనల ప్రకారం అనుమతులు పొందాలని స్పష్టం చేశారు.

ఎన్నికల ఖర్చుల పర్యవేక్షణకు ప్రత్యేక వ్యయ పర్యవేక్షణ కమిటీలను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. నిర్ణీత పరిమితికి మించి ఖర్చు చేసినా, అనుమతి లేకుండా ఎన్నికల కార్యక్రమాలు నిర్వహించినా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఓటర్లను ప్రలోభపెట్టేందుకు డబ్బు లేదా ఇతర బహుమతులు ఇవ్వడం నిషిద్ధమని, ప్రచార సమయాలను కచ్చితంగా పాటించాలని సూచించారు. నామినేషన్ల దాఖలు సమయంలో అభ్యర్థితో పాటు ఇద్దరికి మాత్రమే అనుమతి ఉంటుందని, ప్రతిపాదన సమర్పించే సమయంలో అభ్యర్థితో పాటు ఒకరికి మాత్రమే అనుమతి ఉంటుందని వివరించారు. లౌడ్స్పీకర్ల వినియోగం, ప్రచార సమయాలపై నిబంధనలను కచ్చితంగా అమలు చేస్తామని తెలిపారు. పోలింగ్ కేంద్రానికి 100 మీటర్ల పరిధిలో లౌడ్స్పీకర్ల వినియోగం నిషేధమని స్పష్టం చేశారు. సున్నితమైన పోలింగ్ కేంద్రాల వద్ద వీడియో చిత్రీకరణ ఏర్పాటు చేయడంతో పాటు ఎన్నికల నిర్వహణపై నిరంతర పర్యవేక్షణ ఉంటుందని వెల్లడించారు.

జిల్లాలోని మొత్తం 467 గ్రామ పంచాయతీలకు సంబంధించి రిజర్వేషన్ల ప్రక్రియను ఆర్డీవోలు, ఎంపీడీవోలు పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. వార్డు సభ్యుల స్థానాల విభజన ప్రక్రియను పంచాయతీ అధికారులు చేపడుతున్నట్లు వివరించారు. గ్రామ పంచాయతీ ఎన్నికలను మూడు దశల్లో నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించినట్లు పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన తేదీలను అధికారిక షెడ్యూల్ ప్రకారం నిర్ధారించుకోవాల్సి ఉంది.

ఎన్నికల సమయంలో ప్రచార సరళి, ప్రకటనలపై నిఘా ఉంచేందుకు జిల్లా కలెక్టరేట్, మున్సిపల్ స్థాయిలో మీడియా పర్యవేక్షణ కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో ప్రజలు, రాజకీయ పార్టీలు, మీడియా ప్రతినిధులు సహకరించాలని కలెక్టర్, ఎస్పీ విజ్ఞప్తి చేశారు. ప్రజాస్వామ్య ఎన్నికలను ప్రశాంతంగా, నిష్పాక్షికంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం, పోలీస్ శాఖ సమన్వయంతో పనిచేస్తాయని స్పష్టం చేశారు.

ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి కొండయ్య, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వెంకట సుబ్బయ్య, అటవీ శాఖ అధికారి చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కమిషన్ ఇచ్చిన మార్గదర్శకాల మేరకే ఎన్నికల ప్రక్రియ

- జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్

అనంతపురం, కలెక్టరేట్ అక్టోబర్ 15 మనం న్యూస్: అక్టోబర్ 14న మున్సిపాలిటీ, స్థానిక సంస్థల ఎన్నికలపై షెడ్యూల్ విడుదల అయిందని, ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినదని, ఎన్నికల ప్రక్రియను నిబంధనల మేరకు ప్రశాంత వాతావరణంలో నిష్పక్ష పాతంగా చేపట్టాల్సి ఉంటుందని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్ పేర్కొన్నారు.

గురువారం నగరంలోని జిల్లా పరిషత్ డిపిఆర్సి సమావేశ మందిరంలో జిల్లా పరిషత్, మండల ప్రాదేశిక ఎన్నికలకు సంబంధించి ఆర్ఓ, ఎఆర్ఓలకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని ప్రారంభోపన్యాసం చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెండవ సాధారణ ఎన్నికలు ఎంపిటిసి, జడ్పీటీసీ - 2026కి సంబంధించి రాష్ట్ర ఎన్నికల కమీషన్ ఇచ్చిన మార్గదర్శకాల మేరకు మాత్రమే ఎన్నికల ప్రక్రియ చేపట్టాల్సి ఉంటుందని, సొంతంగా నిర్ణయాలు, ఊహలకు తావు ఇవ్వరాదని ఆర్ఓ, ఎఆర్ఓలను ఉద్దేశించి అన్నారు. ఎన్నికల నిర్వహణలో అధికారులు ఎన్నికల నిబంధనలు, రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసే మార్గదర్శకాలు, రూల్బుక్ను తప్పనిసరిగా అనుసరించాలని సూచించారు. ఎన్నికలు చట్టబద్ధమైన ప్రక్రియ కాబట్టి అధికారులు తమ వ్యక్తిగత అభిప్రాయాలు, సాధారణ అవగాహన లేదా గత ఎన్నికల అనుభవాల ఆధారంగా కొత్త విధానాలు అమలు చేయకూడదని స్పష్టం చేశారు. ప్రతి అంశాన్ని సంబంధిత రూల్బుక్, సర్క్యులర్లు, అధికారిక మార్గదర్శకాల ప్రకారం మాత్రమే నిర్వహించాలని సూచించారు. ఎన్నికల విధుల్లో భాగంగా అధికారులు ముందుగా రూల్బుక్ను పూర్తిగా చదివి, సందేహాలు వచ్చినప్పుడు అందులోని సూచనలు పరిశీలించాలని తెలిపారు. ఎన్నికల సమయంలో ప్రతి రిటర్నింగ్ అధికారి తన పరిధిలో స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుందని, తుది బాధ్యత కూడా సంబంధిత అధికారిదేనని పేర్కొన్నారు. మున్సిపల్, మండల పరిషత్, జిల్లా పరిషత్, గ్రామపంచాయతీ ఎన్నికలు మూడు దశల్లో నిర్వహించనున్నందున అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఒకే అధికారికి ఒకేసారి రెండు లేదా అంతకంటే ఎక్కువ బాధ్యతలు కేటాయించబడితే, ఒకే రోజున రెండు విధులు నిర్వహించాల్సిన పరిస్థితి ఉంటే చివరి నిమిషం వరకు వేచి ఉండకుండా వెంటనే సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. అవసరమైతే ప్రత్యామ్నాయ ఉత్తర్వులు జారీ చేసి విధుల పునర్విభజన చేస్తామని వెల్లడించారు. ప్రశాంత వాతావరణంలో నిష్పక్షపాత ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల విధులు కేటాయించబడిన అధికారులు అందరూ పని చేయాలని, చాలా మంది ఎన్నికల ప్రక్రియపై అవగాహన కలిగి ఉంటారని సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు.

ఈ సందర్భంగా అసిస్టెంట్ కలెక్టర్ సుయశ్ కుమార్ మాట్లాడుతూ ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల ప్రక్రియపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ఎన్నికలపై అందిస్తున్న శిక్షణను ఉపయోగించుకోవాలని పేర్కొన్నారు.

జిల్లా పరిషత్ సిఈఓ విజయలక్ష్మి మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల ప్రక్రియ సజావుగా పూర్తి చేయాలని కోరారు.

అనంతరం రిటైర్డ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గోవిందరాజులు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులుగా నియమింపబడిన అధికారులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పాటుపాడుదాం

- సమావేశంలో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మాజీ ఎమ్మెల్సీతిప్పేస్వామి లు

మడకశిర, అక్టోబర్ 15,మనంన్యూస్: త్వరలోనే జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు గెలుపే ధ్యేయంగా మనమందరం పాటుపాడుదామని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామిలు తెలిపారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం మడకశిర నియోజక వర్గంలోని 5మండలాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు.ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ, పార్టీ పరిశీలకుడు (అబ్జర్వర్) యనమల సుధాకర్, రాష్ట్ర బాలల హక్కులు పరిరక్షణ కమిషన్ సభ్యుడు డాక్టర్ శ్రీనివాస్ మూర్తి,రాష్ట్ర కుంచిటి వక్కలిగా కార్పొరేషన్ చైర్మన్ ఎన్. లక్ష్మీనారాయణ లతో కలసి సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక సంస్థలఎన్నికల్లో అభ్యర్థుల గెలుపే ధ్యేయంగా అన్ని స్థానాల్లో టిడిపి అభ్యర్థులే విజయానికి తమవంతు బాధ్యతగా కృసి చేయాల్సిందిగా వారు పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి పంచాయతీలోనూ కూటమి పార్టీ జెండా ఎగరవేయడమే ధ్యేయంగా అందరూ ఐక్యంగా పనిచేయాలని వారు పిలుపునిచ్చారు.పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని, ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూసుకుంటామని భరోసా వారు కల్పించారు. క్షేత్రస్థాయిలో పట్టున్న సమర్థులైన అభ్యర్థులను ఎన్నికల బరిలో నిలపాలని నాయకులకు స్పష్టమైన సూచనలు సలహాలుఇచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ బిఎస్ గురుమూర్తి, నియోజక వర్గంలోని పార్టీ మండల కన్వీనర్లు, సింగల్ విండో అధ్యక్షులు, పార్టీ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరగాలి

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

జిల్లా ఎస్పీ పి జగదీష్

గుంతకల్లు ,అక్టోబర్ 16 మనం న్యూస్: మున్సిపల్ ఎన్నికల దృష్ట్యా ఎన్నికల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ పి జగదీష్ హెచ్చరించారు. గురువారం ఆయన గుంతకల్లు లో స్ట్రాంగ్ రూములు కౌంటింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు అనంతరం మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించి కమిషనర్ లక్ష్మీదేవితో ఎన్నికల పై సమావేశం నిర్వహించారు అనంతరం విలేకరులతో మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ప్రజలు కోరారు ముఖ్యంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా పోలీసుల పటిష్టమైన భద్రత ఏర్పాటు చేశారని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

స్థానిక ఎన్నికలే లక్ష్యంగా జనసేన వ్యూహరచన.. శ్రేణులకు దిశానిర్దేశం!

కొంతంగి కొత్తూరులో ప్రత్తిపాడు నియోజకవర్గ ఎన్నికల సమన్వయ కమిటీ సమావేశం

శంఖవరంఅక్టోబర్ 15 మనం ప్రతినిధి: స్థానిక సంస్థల ఎన్నికలకు జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు సమాయత్తం కావాలని మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు పిలుపునిచ్చారు. శంఖవరం మండలం కొంతంగి కొత్తూరు గ్రామ సచివాలయంలో కాకినాడ ఎంపీ తంగేళ్ల ఉదయ్ శ్రీనివాస్ ఆదేశాల మేరకు ప్రత్తిపాడు నియోజకవర్గ ఎన్నికల సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు.

జనసేన పార్టీ ప్రత్తిపాడు అసెంబ్లీ సమన్యాయకర్త గొర్లి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు, జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మేడిశెట్టి సూర్యకిరణ్ (బాబి), కాకినాడ పార్లమెంట్ ఎన్నికల సభ్యురాలు బార్లపూడి క్రాంతి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా పార్టీని గ్రామస్థాయిలో బలోపేతం చేయడం, నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం పెంపొందించడం, స్థానిక ఎన్నికలకు పటిష్ఠమైన కార్యాచరణ రూపొందించడంపై చర్చించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.

అనంతరం ఎన్నికల సమన్వయకర్తలు, నిర్వాహక దళ్, సపోర్టింగ్ టీం సభ్యులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలపై గొర్లి నాగేశ్వరరావు కృషిని గుర్తించి గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల పార్టీ నాయకులు, జనసైనికులు, వీర మహిళలు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

అన్నవరం సర్పంచ్ రిజర్వేషన్ ఉత్కంఠ!

- బీసీ మహిళా రిజర్వేషన్ మారనుందా..? జనరల్ అయ్యే అవకాశాలపై గ్రామంలో జోరుగా చర్చ

అన్నవరం, అక్టోబర్ 15, మనం న్యూస్ : అన్నవరం గ్రామపంచాయతీ సర్పంచ్ రిజర్వేషన్ వ్యవహారం స్థానిక రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది. సర్పంచ్ పదవికి పోటీ చేయాలని ఆశిస్తున్న అభ్యర్థుల్లో రిజర్వేషన్ మార్పుపై నెలకొన్న ప్రచారం ఉత్కంఠ రేపుతోంది. ఇప్పటికే ఎన్నికల బరిలో నిలిచేందుకు సిద్ధమైన ఆశావహులు తమ రాజకీయ ప్రయత్నాలను ముమ్మరం చేయగా, తాజాగా తెరపైకి వచ్చిన రిజర్వేషన్ మార్పు చర్చ వారిని డైలమాలో పడేసింది.

బుధవారం ఎన్నికల కమిషన్ విడుదల చేసిన రిజర్వేషన్ల జాబితాలో కాకినాడ జిల్లా శంఖవరం మండలం అన్నవరం గ్రామపంచాయతీ సర్పంచ్ స్థానాన్ని బీసీ మహిళకు కేటాయించినట్లు సమాచారం. దీంతో ఇప్పటివరకు సర్పంచ్ పదవిని ఆశిస్తూ గ్రామంలో ప్రచారం సాగిస్తున్న పలువురు నాయకులు కొత్త సమీకరణాలకు తెరతీశారు. మహిళా రిజర్వేషన్ నేపథ్యంలో తమ కుటుంబాల నుంచి భార్యలను ఎన్నికల బరిలోకి దింపే దిశగా కొందరు ప్రయత్నాలు ప్రారంభించినట్లు గ్రామంలో చర్చ సాగుతోంది.

తాజా ప్రచారంతో మారుతున్న రాజకీయ సమీకరణాలు!

ఇదిలా ఉండగా, గురువారం అన్నవరం సర్పంచ్ స్థానం బీసీ మహిళా రిజర్వేషన్ నుంచి జనరల్ కేటగిరీకి మారే అవకాశం ఉందంటూ గ్రామంలో కొత్త ప్రచారం మొదలైంది. ఈ ప్రచారం నిజమైతే సర్పంచ్ పదవిని ఆశిస్తున్న పలువురు నాయకులకు మరోసారి ప్రత్యక్షంగా పోటీ చేసే అవకాశం లభించవచ్చనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి. అయితే, రిజర్వేషన్ మార్పుపై అధికారిక ప్రకటన వెలువడిందా లేదా అన్నది స్పష్టత రావాల్సి ఉంది.

రిజర్వేషన్ ప్రకటనకు ముందు నుంచే గ్రామంలో రాజకీయంగా పావులు కదిపిన ఆశావహులు, తాజా పరిణామాలతో తమ వ్యూహాలను మార్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. బీసీ మహిళా రిజర్వేషన్ కొనసాగితే మహిళా అభ్యర్థులను రంగంలోకి దింపడం అనివార్యం కాగా, జనరల్ కేటగిరీకి మారితే ఇప్పటివరకు పోటీకి సిద్ధమైన నాయకుల మధ్య పోరు మరింత ఆసక్తికరంగా మారే అవకాశం ఉంది.

అధికారిక స్పష్టత కోసమే ఎదురుచూపులు

ప్రస్తుతం అన్నవరం గ్రామంలో సర్పంచ్ రిజర్వేషన్ అంశం రాజకీయ చర్చలకు కేంద్రబిందువుగా మారింది. ఒకవైపు ఆశావహులు తమ అనుచరులతో సంప్రదింపులు జరుపుతుండగా, మరోవైపు రిజర్వేషన్ మార్పుపై వస్తున్న ప్రచారంతో ఎవరికి వారు తదుపరి అడుగులు వేయాలా వద్దా అనే ఆలోచనలో ఉన్నారు.

అయితే, గ్రామంలో జరుగుతున్న ప్రచారాన్ని మాత్రమే ఆధారంగా చేసుకుని రిజర్వేషన్ మారిందని నిర్ధారించలేం. బీసీ మహిళా రిజర్వేషన్ కొనసాగుతుందా? లేక జనరల్ కేటగిరీగా మారుతుందా? అనే అంశంపై సంబంధిత ఎన్నికల అధికారులు అధికారికంగా స్పష్టత ఇవ్వాల్సి ఉంది. అప్పటివరకు అన్నవరం సర్పంచ్ స్థానానికి సంబంధించిన రాజకీయ ఉత్కంఠ కొనసాగనుంది.

కిర్లంపూడి మండలంలో సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమం

- రైతులకు 100 శాతం రాయితీపై మందుల పంపిణీ
- ఏవో సుధామాధురి

కిర్లంపూడి అక్టోబర్ 15:(మనం న్యూస్): కిర్లంపూడి మండల పరిధిలోని అన్ని రైతు సేవా కేంద్రాల పరిధిలో గురువారం సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించినట్లు మండల వ్యవసాయాధికారి (ఏవో) సుధామాధురి తెలిపారు. రామచంద్రపురం, కిర్లంపూడి తదితర గ్రామాల్లో నిర్వహించిన క్షేత్రస్థాయి కార్యక్రమాలలో ఆమె స్వయంగా పాల్గొని రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ, ప్రస్తుత దశలో వరి పంటకు ఎలుకల బెడద వల్ల దాదాపు 8 నుంచి 10 శాతం మేర దిగుబడి తగ్గే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఎలుకల సమస్యను సమర్థవంతంగా అరికట్టేందుకు వ్యవసాయ శాఖ ద్వారా 'బ్రోమోడయాలిన్' మందును రైతులకు 100 శాతం పూర్తి రాయితీపై పంపిణీ చేస్తున్నట్లు స్పష్టం చేశారు. రైతులందరూ ఒకేసారి సామూహికంగా పొలాల్లో ఈ మందును అమర్చడం ద్వారా ఆశించిన ఫలితాలు సాధించవచ్చని, పంటలను నష్టం నుంచి కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, స్థానిక రైతులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీలు, వార్డుల రిజర్వేషన్లపై తుది గెజిట్ విడుదల చేసిన జిల్లా కలెక్టర్

అమలాపురం అక్టోబర్ 15 మనం ప్రతినిధి : జిల్లాలో గ్రామపంచాయతీలకు సంబంధించి సాధారణ ఎన్నికలు-2026 నిర్వహణలో భాగంగా గ్రామపంచాయతీలు, వార్డుల వారీగా ఖరారు చేసిన తుది రిజర్వేషన్ల గెజిట్ను జిల్లా కలెక్టర్ డాక్టర్ ఆర్. మహేష్ కుమార్ విడుదల చేశారు. గ్రామపంచాయతీ సాధారణ ఎన్నికల నిర్వహణకు సంబంధించి నిబంధనల మేరకు రిజర్వేషన్ల ప్రక్రియను పూర్తి చేసి తుది గెజిట్ను విడుదల చేసినట్లు తెలిపారు. సంబంధిత గ్రామపంచాయతీలు, వార్డులకు కేటాయించిన రిజర్వేషన్ల వివరాలను అధికారిక గెజిట్లో పొందుపరిచినట్లు పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.

జాతీయ రహదారి-44కు మహర్దశ..

- ఆరు లేన్లతో కొత్త రూపు
- జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్

పుట్టపర్తి, అక్టోబర్ 15 మనం న్యూస్: బెంగళూరు-హైదరాబాద్ మధ్య రహదారి ప్రయాణానికి మరింత వేగం, భద్రత చేకూర్చే దిశగా జాతీయ రహదారి-44 విస్తరణ ప్రాజెక్టు ముందుకు సాగుతోంది. శ్రీ సత్యసాయి జిల్లాలో 77 కిలోమీటర్ల మేర ఆరు వరుసల ఆధునిక రహదారిని అభివృద్ధి చేయనుండటంతో భవిష్యత్తులో ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి. వాహనాల రద్దీని తగ్గించడం, ప్రయాణ సమయాన్ని ఆదా చేయడం, స్థానిక ప్రజల రాకపోకలకు ఆటంకాలు లేకుండా చూడటం ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యాలుగా ఉన్నాయి. కర్నూలు నుంచి కొడికొండ వరకు మొత్తం 243 కిలోమీటర్ల మేర చేపట్టనున్న విస్తరణ పనుల్లో భాగంగా జిల్లాలోని రహదారిని ఆధునిక ప్రమాణాలతో ప్రక్రియ పూర్తవడానికి సుమారు ఏడాది నుంచి ఏడాదిన్నర సమయం పట్టవచ్చని కలెక్టర్ వివరించారు. నివేదిక పూర్తయిన అనంతరం టెండర్ల ప్రక్రియ చేపట్టి నిబంధనల మేరకు పనులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ఈ విస్తరణ ప్రాజెక్టు పూర్తయితే శ్రీ సత్యసాయి జిల్లాలో రహదారి సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు వాణిజ్య, రవాణా కార్యకలాపాలకు ఊతం లభించే అవకాశం ఉంది. బెంగళూరు-హైదరాబాద్ మార్గంలో ప్రయాణించే వాహనదారులకు సౌకర్యవంతమైన ప్రయాణం అందుబాటులోకి రావడంతో పాటు స్థానిక ప్రాంతాల అనుసంధానం మరింత మెరుగుపడనుంది.

తప్పు చేశా.. నన్ను క్షమించండి!

- ప్రజలకు మాజీ మంత్రి దాడిశెట్టి రాజా విజ్ఞప్తి..
- తుని రాజకీయాల్లో ఆసక్తికర చర్చ

తుని, అక్టోబర్ 15, మనం న్యూస్ : తుని మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో రాజకీయ సందడి మొదలైంది. ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థులను గెలిపించుకునేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వ్యూహాలకు పదును పెడుతోంది. ఈ క్రమంలో మాజీ మంత్రి, వైసీపీ నాయకుడు దాడిశెట్టి రాజా మున్సిపాలిటీ చైర్పర్సన్ అభ్యర్థిగా పిట్ట రామ తులసిని, మరో 23 మంది వార్డు కౌన్సిలర్ అభ్యర్థులను ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన వ్యాఖ్యలు స్థానిక రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.

꠰తప్పులు జరిగాయని అంగీకారం.. ప్రజలకు క్షమాపణ విజ్ఞప్తి

మీడియాతో మాట్లాడిన దాడిశెట్టి రాజా.. గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పాలనలో తుని మున్సిపాలిటీలో కొన్ని తప్పులు జరిగాయని అంగీకరించారు. తాను నమ్మి బాధ్యతలు అప్పగించిన వ్యక్తులు కొన్ని పొరపాట్లు చేశారని పేర్కొన్నారు. గతంలో జరిగిన తప్పులు మళ్లీ పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటానని స్పష్టం చేశారు. తాను గతంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను దృష్టిలో ఉంచుకుని ప్రజలు తనను క్షమించాలని పరోక్షంగా విజ్ఞప్తి చేశారు.

గతంలో జరిగిన పరిణామాలను పక్కనపెట్టి, భవిష్యత్తులో ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అవకాశం కల్పించాలని ఆయన కోరినట్లు రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. తన పాలనలో జరిగిన తప్పులను అంగీకరిస్తూ చేసిన వ్యాఖ్యలు ఎన్నికల వేళ ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

చైర్పర్సన్ అభ్యర్థిగా పిట్ట రామ తులసి

తుని మున్సిపాలిటీ చైర్పర్సన్ అభ్యర్థిగా పిట్ట రామ తులసిని ప్రకటించిన దాడిశెట్టి రాజా.. ఆమెతో పాటు మరో 23 మంది కౌన్సిలర్ అభ్యర్థులను ప్రజలకు పరిచయం చేశారు. పార్టీ అభ్యర్థులకు ఓటర్లు మద్దతు తెలిపి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. మున్సిపాలిటీ అభివృద్ధి, ప్రజలకు మెరుగైన సౌకర్యాల కల్పనలో తమ పార్టీ అభ్యర్థులకు అవకాశం ఇవ్వాలని కోరారు.

ఎందుకో?

కొన్నిసార్లు పకపకా నవ్వాలనిపిస్తుంది -
నవ్వుల పూలు విరబూయాలని,
నలుదిక్కులా ఆనందం చిందేలా
నా మనసే వసంతం కావాలని!
కొన్నిసార్లు గగనాన విహరించాలనిపిస్తుంది -
ఆకాశపు అంచుల్ని తాకాలని,
గాలిపటమై గాలితో పోటీపడుతూ
కలల లోకంలో విహరించాలని!
కొన్నిసార్లు ఎదురుతిరగాలనిపిస్తుంది -
ఎదలోని ఆవేశం ఎగిసిపడాలని,
అన్యాయపు గోడలను కూలదోస్తూ
ఆత్మగౌరవపు జెండా ఎగరేయాలని!
కొన్నిసార్లు తలవంచాలనిపిస్తుంది -
తప్పులను తలచుకొని తల్లడిల్లుతూ,
అహంకారాన్ని అణచి వినయంతో
ఆత్మపరిశీలన చేసుకోవాలని!
కొన్నిసార్లు పారిపోవాలనిపిస్తుంది -

బాధల బంధాలు వెంటాడుతుంటే,
బరువెక్కిన బ్రతుకు బాటల నుంచి
దూరతీరాలకు చేరుకోవాలని!
కొన్నిసార్లు మాటలాడాలనిపిస్తుంది -
మనసులోని మధురిమలన్నీ పంచాలని,
మౌనంగా మిగిలిన మమతలన్నీ
మాటల ముత్యాలుగా మార్చాలని!
కొన్నిసార్లు మౌనం వహించాలనిపిస్తుంది -
మాటల మంటలు మనసును దహిస్తుంటే,
వాదనల వలయాల నుంచి విడివడి
ప్రశాంత తీరాన నిలవాలని!
కొన్నిసార్లు రాయాలనిపిస్తుంది -
రాయని భావాల రెక్కలు విప్పాలని,
కన్నీటి చుక్కల్ని కవితలుగా మార్చి
కాగితంపై హృదయాన్ని పరచాలని!
కొన్నిసార్లు ఏడ్వాలనిపిస్తుంది -
ఎదలోని వేదనంతా కరిగిపోవాలని,
కన్నీటి ధారలో కలతలన్నీ కొట్టుకుపోయి
కలతలేని మనసు మిగలాలని!
కొన్నిసార్లు ఇలా... కొన్నిసార్లు అలా...
ఇదే కదా మనసు చేసే గారడీ!
మనసన్నది మాయల మలుపుల బాట,
మార్పులే దాని నిత్య జీవితపాట!

- గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్

ఓటు తుడిచివేతపై విపక్షాల ఆగ్రహం

ఓటరు జాబితా అనేది కేవలం కాగితంపై ముద్రితమైన పేర్ల నిశ్చేతన సంకలనం కాదు. అది ప్రజాస్వామ్య మహాసౌధానికి ప్రాణాధారమైన పౌర సార్వభౌమత్వ పత్రం. స్వతంత్ర భారతంలో ప్రతి పౌరుడికి రాజ్యాంగం ప్రసాదించిన పరమ పవిత్రమైన గళం-ఓటు హక్కు. అటువంటి ప్రాథమిక హక్కును ప్రభావితం చేసేలా భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (స్పెషల్ఇంటెన్సివ్ రివిజన్-ఎస్ఐఆర్) ప్రక్రియ ఇప్పుడు దేశ రాజకీయ యవనికపై తీవ్రమైన ఘర్షణకు, ప్రతిష్టంభనకు కారణమైంది. ఓటర్ల జాబితాల ప్రక్షాళన పేరుతో అర్హులైన అట్టడుగు వర్గాల ఓట్లను భారీగా తొలగిస్తున్నారంటూ విపక్ష ఇండియా కూటమి భగ్గుమంటుంటే, నకిలీ నమోదులను, మరణించినవారి పేర్లను తొలగించి జాబితాలను పారదర్శకంగా మార్చే విధినిర్వహణే ఇదని కేంద్ర ఎన్నికల సంఘం సమర్థించుకుంటోంది. ఈ పరస్పర విరుద్ధ వాదనల నడుమ రాజకీయ సమరం వీధుల నుంచి రాజ్యాంగ అధినేత్రి నిలయమైన రాష్ట్రపతి భవన్ ముంగిటకు చేరింది.

ఈ సంక్షోభం ఒక్కసారిగా ఉద్భవించింది కాదు. దీని వెనుక అనేక పరిణామాలు, వివాదాస్పద నిర్ణయాలు దాగి ఉన్నాయి. ముఖ్యంగా సెప్టెంబరు 25న వెలువడిన పరిశోధనాత్మక కథనాలు, కమిషన్ అంతర్గత వ్యవహారాలపై వచ్చిన కథనాలు విపక్షాల్లో తీవ్ర అలజడిని రేపాయి. దేశవ్యాప్తంగా లక్షలాది మంది పేదలు, వలస కార్మికులు, నిమ్న వర్గాల ప్రజలు, చిరునామాలు మారిన సామాన్యుల పేర్లు నిబంధనల సాకుతో ఓటరు జాబితాల నుంచి గల్లంతవుతున్నాయని విపక్షాలు వాదిస్తున్నాయి. దీనికితోడు కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ వైఖరి నిష్పాక్షికంగా లేదంటూ ఆయన తక్షణమే రాజీనామా చేయాలని ఇండియా కూటమి డిమాండ్ చేస్తోంది. ప్రజాస్వామ్య పరిరక్షణే ధ్యేయంగా సెప్టెంబరు 30న ప్రతిపక్ష పార్టీలు సమాలోచనలు జరిపి, అక్టోబరు 2న గాంధీ జయంతి మొదలుకొని అక్టోబరు 8 వరకు దేశవ్యాప్త సేవ్ డెమోక్రసీ నిరసనలకు పిలుపునిచ్చాయి.

ఈ పోరాట క్రమంలో దేశ రాజధాని ఢిల్లీ వీధులు అట్టుడికిపోయాయి. అక్టోబరు 6న పార్లమెంటు ప్రాంగణం నుంచి నిర్వాచన్ సదన్ (ఎన్నికల సంఘ ప్రధాన కార్యాలయం) వైపు వందలాది మంది విపక్ష ఎంపీలు శాంతియుతంగా తలపెట్టిన మార్చ్‌ను ఢిల్లీ పోలీసులు దారిలోనే అడ్డుకోవడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. అనంతరం ఆకాశవాణి భవన్ వద్ద ఎంపీలు బైఠాయించి సుదీర్ఘ నిరసన చేపట్టారు. అక్టోబరు 7న జంతర్ మంతర్ సమీపంలో ఆందోళనకు దిగిన ఇండియా కూటమి అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ వాద్రాలతో పాటు పలువురు ఎంపీలను పోలీసులు బలవంతంగా అదుపులోకి తీసుకుని నిర్బంధించారు.

దేశ వాణిజ్య రాజధాని ముంబైతో పాటు పశ్చిమ బెంగాల్, కేరళ, తమిళనాడు తదితర రాష్ట్రాల్లో పౌరసమాజం, ప్రజాసంఘాలు, విద్యార్థి లోకం పెద్దయెత్తున రోడ్లపైకి వచ్చి ఎస్ఐఆర్ ప్రక్రియను ప్రశ్నించాయి. అక్టోబరు 8న దేశవ్యాప్తంగా కాంగ్రెస్, మిత్రపక్షాలు అన్ని జిల్లా కేంద్రాల్లో ఆందోళనలను మరింత ఉద్ధృతం చేశాయి.

వీధి పోరాటాల అనంతరం ఇండియా కూటమి తమ కార్యాచరణను రాజ్యాంగబద్ధ మార్గాల వైపు మళ్లించింది. భారత ప్రథమ పౌరులు, రాజ్యాంగ పరిరక్షకురాలైన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును కలిసి ఎన్నికల సంఘం ఏకపక్ష వైఖరిని, ఎస్ఐఆర్ లోపాలను వివరించేందుకు సమయం కోరింది. దాదాపు పది మంది కీలక నేతలతో కూడిన ప్రతినిధి బృందం శుక్రవారం నాడు రాష్ట్రపతిని కలిసి వినతిపత్రం సమర్పించేందుకు సిద్ధమైంది. గతంలో సీపీఎం రాజ్యసభ ఎంపీ జాన్ బ్రిట్టాస్ పంపిన లేఖపై స్పందించిన రాష్ట్రపతి భవన్, ఆ అంశాన్ని పరిశీలించాలని కేంద్ర న్యాయ, శాసన వ్యవహారాల శాఖకు పంపిన ఉదంతాన్ని ప్రతిపక్షాలు తమ నైతిక విజయంగా ప్రస్తావిస్తున్నాయి. అయితే, భారత రాజ్యాంగంలోని అధికరణ 324 ప్రకారం ఎన్నికల సంఘం ఒక స్వయంప్రతిపత్తి కలిగిన వ్యవస్థ. సుప్రీంకోర్టు న్యాయమూర్తిని తొలగించే విధంగానే పార్లమెంటు ఉభయ సభల్లో ప్రత్యేక మెజారిటీతో మహాభియోగ తీర్మానం ఆమోదం పొందితే తప్ప సీఈసీని పదవి నుంచితప్పించడం సాధ్యం కాదు. కాబట్టి రాష్ట్రపతితో జరిగే ఈ భేటీ పరిపాలనాపరంగా తక్షణ నిర్ణయాలకు దారితీయకపోయినా, నైతికంగా అధికార పక్షంపై, ఎన్నికల సంఘంపై తీవ్రమైన ఒత్తిడిని పెంచే రాజకీయ అస్త్రంగా మారుతుందనడంలో సందేహం లేదు.

ఓటరు జాబితా సమగ్ర సవరణ అనేది ఒక నిరంతర అవసరమే కావచ్చు. ఒకే వ్యక్తి పలు ప్రాంతాల్లో ఓటు కలిగి ఉండటం, చనిపోయినవారి పేర్లు తొలగించకపోవడం ప్రజాస్వామ్య ఎన్నికల విశ్వసనీయతను దెబ్బతీస్తాయి. కానీ, ఆ ప్రక్షాళన నెపంతో సహజ న్యాయ సూత్రాలకు తిలోదకాలు ఇవ్వడం అత్యంత ప్రమాదకరం.

ఓటరు జాబితా నుంచి ఒక పేరును తొలగించే ముందు సదరు పౌరుడికి ముందస్తు సమాచారం ఇవ్వడం, వివరణ కోరడం, అభ్యంతరాలను నివృత్తి చేసేందుకు నిర్ణీత గడువు కల్పించడం చట్టబద్ధమైన బాధ్యత. సాంకేతిక లోపాలతోనో, క్షేత్రస్థాయి అధికారుల నిర్లక్ష్యంతోనో ఒక అర్హుడైన పేదవాడి పేరు గల్లంతైతే, ఆ పౌరుడు తన ప్రజాస్వామిక అస్తిత్వాన్ని, పాలకులను ఎన్నుకునే హక్కును కోల్పోతాడు. విపక్షాలు లేవెత్తుతున్న మౌలిక ఆందోళన ఇదే. అధికార పక్షం, ఎన్నికల సంఘం ఈ ఆరోపణలను కేవలం రాజకీయ ప్రేరేపితమైనవిగా కొట్టిపారేయకుండా, తొలగించిన ప్రతి ఓటుకు సంబంధించిన వివరాలను, కారణాలను పబ్లిక్ డొమైన్లో ఉంచి పారదర్శకతను నిరూపించుకోవాలి.

ఈ సంక్షోభం కేవలం అధికార, విపక్షాల మధ్య సాగే తాత్కాలిక రాజకీయ ఆధిపత్య పోరు కాదు.ఇది రాజ్యాంగ వ్యవస్థల స్వతంత్రతకు, స్వయంప్రతిపత్తికి ఎదురైన కఠిన పరీక్ష. ఒక ప్రజాస్వామ్య దేశంలో ఎన్నికల నిర్వహణ సంస్థ నిస్సందేహంగా, నిష్పాక్షికంగా, ఎలాంటి బాహ్య ఒత్తిళ్లకు తలొగ్గకుండా వ్యవహరిస్తుందన్న ప్రజల ప్రగాఢ విశ్వాసమే ఆ దేశానికి అసలైన రక్షాకవచం. అదే సమయంలో, విపక్షాలు కూడా ప్రజాస్వామ్య నిరసనల పేరుతో సామాన్య ప్రజల దైనందిన జీవనానికి, రవాణా వ్యవస్థకు విఘాతం కలగకుండా నిగ్రహం పాటించాలి.

ఆరోపణలను అర్థరహిత నినాదాలుగా మార్చకుండా నిక్కచ్చిగా గణాంకాలతో, ఆధారాలతో రుజువు చేయాలి. పార్లమెంటరీ చర్చలు, న్యాయ సమీక్ష, రాజ్యాంగ వేదికలే సమస్య పరిష్కారానికి నిజమైన రాచమార్గాలు. ప్రజాస్వామ్య వేదికపై పౌరుడే నిజమైన సార్వభౌముడు. ప్రతి అర్హుడైన పౌరుని ఓటు హక్కు భద్రంగా ఉన్నప్పుడే, ఆ పౌర సార్వభౌమత్వం విలువలు మరింత అఖండంగా నిలదొక్కుకుంటాయి..

- రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

ఆకలి లేని రేపటి కోసం...సంరక్షణే మార్గం

మానవ మనుగడకు అత్యంత ప్రాథమికమైనది ఆహారం. 'అన్నం పరబ్రహ్మ స్వరూపం' అని మన ప్రాచీన సంస్కృతి చాటి చెప్పినట్లుగానే, జీవకోటి శ్వాసించాలన్నా, సమాజం పురోగమించాలన్నా ఆహార భద్రతే మూలాధారం. ప్రపంచ వ్యాప్తంగా ఆహార భద్రత ప్రాముఖ్యతను వివరిస్తూ, ఆకలి, పోషకాహార లోపం వంటి సమస్యలపై చైతన్యం నింపేందుకు ప్రతి సంవత్సరం అక్టోబర్ 16న 'ప్రపంచ ఆహార దినోత్సవం' జరుపు కుంటాము. 1945లో ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'ఆహార మరియు వ్యవసాయ సంస్థ' (FAO) స్థాపన దినోత్సవానికి గుర్తుగా ఈ రోజును నిర్వహిస్తున్నారు.

నేటి ఆధునిక యుగంలో శాస్త్ర సాంకేతిక రంగాలు ఎంతో పురోగమించినప్పటికీ, ప్రపంచం ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాలు ఆకలి నిర్మూలన. ఒకవైపు మితిమీరిన ఆహార వృథా, మరోవైపు పూట గడవని దారిద్ర్యం. గణాంకాల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది ప్రజలు ప్రతి రోజూ ఆకలితో నిద్రపోతున్నారు. ముఖ్యంగా చిన్న పిల్లలు పోషకాహార లోపంతో అనేక వ్యాధుల బారిన పడుతున్నారు. ఇది కేవలం ఒక వ్యక్తిగత సమస్య మాత్రమే కాదు. దేశ సమగ్ర అభివృద్ధిని, మానవ వనరుల ఉత్పాదకతను తీవ్రంగా దెబ్బ తీసే సామాజిక విపత్తు.

నేడు ఆహార ఉత్పత్తి మరియు పంపిణీ వ్యవస్థలు అనేక తీవ్రమైన సమస్యలను ఎదుర్కొంటున్నాయి. వాతావరణ మార్పుల వల్ల సంభవిస్తున్న అకాల వర్షాలు, కరువులు మరియు తుఫానులు వ్యవసాయ రంగాన్ని తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి. దీనికి తోడు నేల సారహీనత, భూగర్భ జలాలు అడుగంటిపోవడం మరియు యుద్ధాలు-భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల వల్ల ఆహార ధాన్యాల సరఫరా వ్యవస్థలు చిన్నభిన్నమవుతున్నాయి. మరోవైపు, ఉత్పత్తి అయిన ఆహారంలో దాదాపు మూడో వంతు నిల్వ సదుపాయాలు లేకపోవడం వల్ల, లేదా వినియోగదారుల అజాగ్రత్త వల్ల వృథా అయిపోతోంది.

ఆకలి రహిత ప్రపంచాన్ని నిర్మించాలంటే మనకు ఆహారాన్ని అందించే 'రైతు' సంక్షేమానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి. ప్రకృతి వైపరీత్యాలను తట్టుకునే వంగడాలను ప్రాచుర్యంలోకి తీసుకురావడం, సేంద్రీయ మరియు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడం నేటి తక్షణ అవసరం. చుక్క నీటినీ వృథా చేయకుండా బిందు మరియు తుంపర సేద్యం వంటి ఆధునిక నీటి యాజమాన్య పద్ధతులను అవలంబించాలి. అలాగే, సాంకేతికతను ఉపయోగించి పంట దిగుబడులను పెంచుతూనే, నేల కాలుష్యాన్ని అరికట్టే దిశగా అడుగులు వేయాలి.

ఆకలి నిర్మూలన అనేది కేవలం ప్రభుత్వాలు లేదా స్వచ్ఛంద సంస్థల బాధ్యత మాత్రమే కాదు; అది ప్రతి పౌరుడి బాధ్యత. ఆహారాన్ని వృథా చేయకపోవడం మనం ఇంట్లోనే ప్రారంభించగల మొదటి మార్పు. ఇంట్లో, వేడుకలలో లేదా హోటళ్లలో అవసరమైనంత మాత్రమే ఆహారాన్ని సిద్ధం చేసుకోవాలి. ప్రపంచీకరణ యుగంలో కూడా ఆహార ధాన్యాల పంపిణీలో అసమానతలు తీవ్రంగా ఉన్నాయి. యుద్ధాలు, అంతర్జాతీయ వాణిజ్య ఆంక్షలు మరియు ద్రవ్యోల్బణం కారణంగా అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఆహార ధరలు ఆకాశాన్నంటుతున్నాయి.

మానవ మనుగడకు, నైతిక పురోగతికి ఆహార భద్రతే ప్రధాన పునాది. నేటి ఆధునిక యుగంలో ఆహార లభ్యత అనేది కేవలం ఎంత విస్తీర్ణంలో

పంటలు పండిస్తున్నామనే దానిపైనే కాకుండా, ఆ ఆహారాన్ని ప్రజలందరికీ సమానంగా అందించే ఆర్థిక, విధానపరమైన మార్గాలపై కూడా ఆధారపడి ఉంది. ప్రపంచ వ్యాప్తంగా రోజు రోజుకూ పెరుగుతున్న జనాభా, మారుతున్న జీవన శైలి మరియు భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల మధ్య ఆహార భద్రతను సాధించాలంటే సాంకేతిక, పర్యావరణ, మరియు పాలనా రంగాలు సమిష్టిగా పనిచేయాల్సిన అవసరం ఉంది.

అత్యంత ప్రధానమైన అడ్డంకి పంపిణీలోని అసమానతలు. ప్రపంచంలో ఒకవైపు విస్తారమైన ఆహార ఉత్పత్తి జరుగుతున్నప్పటికీ, సరఫరా వ్యవస్థల వైఫల్యం,యుద్ధాలు మరియు ఆర్థిక ద్రవ్యోల్బణం వల్ల కోట్లాది మంది ప్రజలు సరైన ఆహారాన్ని కొనుగోలు చేయలేకపోతున్నారు. ధనిక సమాజాలలో ఆహారం అధికంగా వృథా అవుతుంటే, అభివృద్ధి చెందుతున్న దేశాల్లో కొనుగోలు శక్తి లేక లక్షలాది కుటుంబాలు పోషకాహార లోపంతో అలమటిస్తున్నాయి. ఇది కేవలం వ్యవసాయ రంగానికి సంబంధించిన లోపం కాదు; ఇది అంతర్జాతీయ ఆర్థిక అసమానతల ప్రతిరూపం.

పర్యావరణ కోణంలో చూస్తే, మన ఆహార ఉత్పత్తి వ్యవస్థలు తీవ్రమైన ఒత్తిడికి లోనవుతున్నాయి. గ్రీన్ హౌస్ వాయువుల ఉద్గారాలలో వ్యవసాయం, పశుపోషణ మరియు ఆహార రవాణా రంగాలు గణనీయమైన వాటాను కలిగి ఉన్నాయి. రసాయనాల మితిమీరిన వినియోగం వల్ల నేల సారం క్షీణించి, భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయి. అధిక దిగుబడినిచ్చే కొన్ని నిర్దిష్ట రకాల పంటలపైనే శ్రద్ధ చూపడం వల్ల సంప్రదాయ, స్థానిక పంటలు కనుమరుగై జీవవైవిధ్యానికి ముప్పు వాటిల్లుతోంది.

ఈ సవాళ్లను అధిగమించడంలో అగ్రిటెక్ విప్లవం కొత్త ఆశలను చిగురింపజేస్తోంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డ్రోన్లు మరియు సెన్సార్ల సహాయంతో పచ్చిక సేద్యం చేసి నీరు, ఎరువుల వృథాను అరికట్టవచ్చు. కోల్ స్టోరేజీల విస్తరణ మరియు సరుకు రవాణాలో సమర్థవంతమైన మార్పులు తీసుకురావడం ద్వారా పంటకోత అనంతర నష్టాలను, మార్గ మధ్యంలో జరిగే వృథాను అట్టడుగు స్థాయికి తగ్గించవచ్చు.

వివిధ దేశాలు తమ భౌగోళిక వాతావరణం, సాంకేతిక పురోగతి మరియు ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా వైవిధ్యమైన ఆహార విధానాలను అవలంబిస్తున్నాయి. అమెరికా, నెదర్లాండ్స్ వంటి అభివృద్ధి చెందిన దేశాలు అగ్రిటెక్, ప్రిసిషన్ ఫార్మింగ్ మరియు నిరంతర ఆవిష్కరణలపై దృష్టి సారిస్తున్నాయి. భూమి వైశాల్యం తక్కువగా ఉన్నప్పటికీ నెదర్లాండ్స్ గ్రీన్‌హౌస్ టెక్నాలజీ, వర్టికల్ ఫార్మింగ్ మరియు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఉపయోగించి ఆహార ఎగుమతుల్లో ప్రపంచంలోనే అగ్రగామిగా నిలిచింది. యూరోపియన్ యూనియన్ దేశాలు రసాయనాల వాడకాన్ని తగ్గించి, సుస్థిర పర్యావరణ వ్యవసాయానికి ప్రాధాన్యత ఇస్తుంటే, సింగపూర్ వంటి దేశాలు స్థానిక ఆహార లభ్యతను పెంచేందుకు ఇండోర్ ఫార్మింగ్ మరియు వర్టికల్ ఆక్వాకల్చర్‌ను ప్రోత్సహిస్తున్నాయి. ఆఫ్రికన్, ఆసియా దేశాలు సామాజిక భద్రత, ధరల స్థిరీకరణ మరియు చిన్న తరహా రైతుల మద్దతు కేంద్రంగా ఆహార విధానాలను రూపొందిస్తున్నాయి. భారతదేశంలో ప్రపంచంలోనే అతిపెద్ద ఆహార భద్రతా చట్టం (NFSA) ద్వారా ఉచిత లేదా చవకైన ఆహార ధాన్యాల పంపిణీ, కనీస మద్దతు ధర మరియు ప్రజా పంపిణీ వ్యవస్థల పై ఆధారపడుతుంటే, బ్రెజిల్ వంటి దేశాలు 'జీరో హంగర్' కార్యక్రమం ద్వారా పేద కుటుంబాలకు ప్రత్యక్ష నగదు బదిలీ మరియు ఉచిత బడి భోజనాన్ని అనుసంధానించాయి. ఆఫ్రికన్ దేశాలు 'క్లైమేట్-స్మార్ట్ అగ్రికల్చర్' ద్వారా కరువును తట్టుకునే విత్తనాలు నీటి సంరక్షణ పద్ధతులను అమలు చేస్తూ ఆహార భద్రతను సాధించేందుకు కృషి చేస్తున్నాయి.

ఎవరినీ వెనుకబడిపోనివ్వవద్దు అనే సంకల్పంతో ముందడుగు వేసినప్పుడే ప్రపంచ ఆహార దినోత్సవానికి నిజమైన సార్థకత చేకూరుతుంది. ఆహారం అనేది మానవ హక్కు. ప్రతి ఒక్కరికీ నాణ్యమైన, పోషకాలతో కూడిన ఆహారం అందుబాటులో ఉన్నప్పుడే సుస్థిర అభివృద్ధి సాధించబడుతుంది. కాబట్టి, ఆహారాన్ని గౌరవిద్దాం, వృథాను అరికడదాం, ఆకలి లేని ఆనందమయ ప్రపంచాన్ని నిర్మించడంలో మనవంతు పాత్ర పోషిద్దాం!

అక్టోబర్ 16 ప్రపంచ ఆహార దినోత్సవం
- సుధాకర్.ఏ.వి
9000674747

మళ్ళీ రాజుకొంటోంది..

నిజం నిప్పై మళ్ళీ రాజకుంటోంది..!
నినాదాల హోరెత్తిన పాతబాట కొత్త కవాతుతో
దేశం దశ దిశ దిద్దబోతోంది
ప్లకార్డు మారినా పరంపర కొనసాగుతోంది
గుండెకాయ లాంటి ఎన్నికల వ్యవస్థ
మరమ్మత్తుకి నడుం కట్టిన
అసమాన యువపోరాటకెరటం
అరెస్టులు ఆంక్షలు తట్టుకొని
బ్యారికేడ్లు అడ్డుగోడలు చీల్చుకొని
ఆకాశమంత ఎత్తు ఎగిసిపడుతోంది..!
ఆయువు వాయువు ఓటు హక్కు!
ఆ హక్కుని తొక్కేస్తోన్న రాజ్యం దౌర్జన్యాన్ని
రాజ్యాంగస్ఫూర్తితో ప్రశ్నించేందుకు ప్రభవించిన
కుల మత లింగ భేదం లేని నవయుగం
పరిధి దాటని నదిలా పరవళ్లు తొక్కుతోంది..!
నాడు విచ్చిన వెలుగురేకులు వాడిపోకుండా
రాత్రీ పగలు అలుపు లేని నినాదకెరటాలతో
యువతరంగం పెనునిద్దర వదిలించేందుకు
దేశ హృదయతీరాన్ని తట్టి లేపుతూనే వుంది!
నిజాన్ని, సామాన్యుడ్ని గెలిపించేందుకు
నడుం కట్టిన మువ్వన్నెల జెండాలిప్పుడు
మరో స్వతంత్రపోరాటాన్ని భుజాన మోస్తూ
కాంతులు చిమ్ముతున్నాయ్
రాజ్యం రక్కసి చేతుల్లో..
దారం తెగిన పతంగిలా చిక్కిన ప్రజాస్వామ్యాన్ని
నిలువెల్లా విడిపించేందుకు
ఈ నిత్య పోరాటజ్యోతి వెలుగుతూనే ఉండాలి!

- భీమవరపు పురుషోత్తమ్
9949800253

ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు
manamlekhalu@ gmail.com
మెయిల్ అడ్రస్‌కు పంపగలరు
ఈ పేపర్ కోసం
https://www.manamepaper.com/
వెబ్‌సైట్‌లో చూడండి– ఎడిటర్

మారుతున్న బతుకమ్మ పండుగ స్వరూపం..

తెలంగాణ నేల ప్రకృతిని సాక్షాత్ పరబ్రహ్మ స్వరూపంగా దర్శించి, పూలనే దేవతలుగా కొలిచే అపురూప సాంస్కృతిక జీవన సౌందర్యం బతుకమ్మ పండుగ. స్త్రీత్వంలోని నైసర్గిక సృజనాత్మకతను, శ్రమజీవుల వేదనను, కుటుంబ అనుబంధాల మాధుర్యాన్ని, సమాజ సమష్టి చైతన్యాన్ని ఏకసూత్రంతో బంధించే అరుదైన సాంస్కృతిక మహోత్సవమిది. తీరొక్క పూలను గోపురంలా పేర్చి గౌరమ్మను కొలవడం, లయాత్మక చప్పట్ల తాళాల నడుమ గొంతు కలిపి బతుకు గాథలను ఆలపించడం, మాతృభూమి ఒడిలో ఆత్మీయతలను నెమరువేసుకోవడమే ఈ మహాపర్వపు మౌలిక అంతరార్థం. కాలగమనంలో చోటు చేసుకున్న పెనుమార్పులు, వినియోగ సంస్కృతిని పెంచిన కృత్రిమ జాడ్యాలు, ఆడంబరాల వెనుక పరుగెత్తే యాంత్రిక జీవనం వల్ల ఈ వేడుకలోని సనాతన సంప్రదాయాలు క్రమంగా తెరమరుగవుతున్నాయి. తెలంగాణ సమాజంలో నేడు చోటు చేసుకుంటున్న మార్పులను నిశితంగా పరిశీలిస్తే, సాంస్కృతిక అస్తిత్వ పరిరక్షణ ఎంతటి పెను సవాలుగా మారిందో స్పష్టమవుతోంది. పండుగలో మార్పులు రావడం కాలక్రమంలో సహజ పరిణామమే అయినా, దాని జీవధార అయిన అంతరంగిక ఆత్మను, పర్యావరణ స్పృహను కోల్పోవడం సమాజ మనుగడకే తీరని నష్టం.

శరదృతువు ఆరంభాన శరన్నవరాత్రుల వేళ, భాద్రపద బహుళ మహాలయ అమావాస్య నాటి 'ఎంగిలిపూల బతుకమ్మ'తో మొదలై ఆశ్వయుజ శుద్ధ దుర్గాష్టమి నాటి 'సద్దుల బతుకమ్మ' వరకు తొమ్మిది రోజుల పాటు సాగే ఈ ఉత్సవ శోభ వర్ణనా తీతం. ఉపాధి కోసం దూరతీరాలకు, మహానగరాలకు, గల్ఫ్ దేశాలకు వలసవెళ్లిన బిడ్డలంతా తమ మూలాలను వెతుక్కుంటూ సొంత గూటికి చేరే పవిత్ర వారధి ఈ పండుగ. అత్తవారింట్లో ఉన్న ఆడబిడ్డలు పుట్టింటికి చేరి, బాల్యస్మృతులను నెమరువేసుకుంటూ తోబుట్టువులతో గడిపే అపురూప వేళ ఇది. తెలంగాణలోని బీడు భూములైనా, చేలగట్లు, చెరువుల పరిసరాలు, గుట్టల వెంబడి పల్లెజనం స్వయంగా నడచి వెళ్లి పూలను సేకరించేవారు. 'గునుగూ పూచే గుబురుల నిండా.. తంగేడు పూచే తరగల నిండా' అంటూ పాడుకుంటూ పసుపు వర్ణపు తంగేడు, తెల్లని గునుగు, కాట్లకుక్క, గుమ్మడి, రుద్రాక్ష, సీతమ్మ జడలు, కట్లపూలు, బంతి, చేమంతులను కోసుకొచ్చేవారు. ఈ పూల సేకరణ కేవలం ఒక ఆచారం కాదు. ఏ పువ్వుకు ఎలాంటి ఔషధ గుణముందో, తంగేడులోని క్రిమినాశక శక్తి ఏమిటో, గుమ్మడి పువ్వుతో గౌరమ్మను ఎందుకు అర్చించాలో పెద్దలు చెబుతుంటే పిల్లలు ఆ జీవవైవిధ్య విజ్ఞానాన్ని సహజంగానే ఒంటబట్టించుకునేవారు. మోదుగాకులు, ఇస్తరాకులు, ఇత్తడి తాంబాలాలపై గుండ్రటి వలయాలుగా, ప్రకృతి వర్ణమాలలా పూలను వరుసలవారీగా శిఖరంలా అమర్చడంలో మహిళల విశిష్ట కళా నైపుణ్యం ప్రతిఫలించేది.

ఈ తొమ్మిది రోజుల మహోత్సవంలో రోజుకొక విశిష్ట నైవేద్య సమర్పణ పవిత్ర ఆచారంగా నిలిచింది. వర్షాకాలం ముగిసి శీతాకాలం మొదలయ్యే సంధి కాలంలో వాతావరణ మార్పుల వల్ల సంక్రమించే రుగ్మతలను హరించే అద్భుత ఆయుర్వేద పోషకాహారాలు. ఇరుగు పొరుగుతో ఈ సద్దులను పంచు కోవడం వల్ల సమాజంలో హెచ్చుతగ్గులు సమసి పోయి, సమష్టి జీవన సౌభాగ్యం వెల్లివిరిసేది. సాయం సంధ్యా వేళల్లో పట్టువస్త్రాలు ధరించిన మహిళలు నెత్తిమీద బతుకమ్మలను ఎత్తుకొని చెరువు కట్టలు, ఊరి రచ్చబండలు, గోదావరి వంటి పుణ్యనదీ తీరాలకు బారులుతీరి వెళ్లే దృశ్యం కనులవిందు చేసేది. ఆలయప్రాంగణాల్లో వందలాది బతుకమ్మలను మధ్యలో ఉంచి, వాటి చుట్టూ స్త్రీలు లయాత్మక వలయాలుగా తిరుగుతూ 'శ్రీలక్ష్మి నీ మహిమలు గౌరమ్మ.. చిత్రమై తోచునమ్మా గౌరమ్మ', 'ఒక్కేసి పువ్వేసి చందమామా..ఒక్క జాము ఆయె చందమామా','చిత్తా చిత్తుల బొమ్మ శివుని ముద్దుల గుమ్మ' అంటూ గొంతు కలిపి ఆలపించేవారు. ఆ జానపద గేయాల్లో రామాయణ, భారతాల పౌరాణిక ఘట్టాలతో పాటు, అత్తాకోడళ్ల అలకలు, పుట్టింటి తీపి జ్ఞాపకాలు, శ్రామిక స్త్రీల కష్టసుఖాలు, తెలంగాణ ప్రజా జీవన తాత్వికత ప్రతిధ్వనించేవి. రాతకోతల్లో భద్రపరచని ఈ అమూల్యమైన మౌఖిక సాహిత్యం తరం నుంచి తరానికి అలవోకగా సంక్రమించేది. పూజల అనంతరం మహిళలు పసుపు గౌరమ్మను భక్తితో నుదుట దిద్దుకుని, బతుకమ్మలను నిదానంగా జలాల్లో నిమజ్జనం చేసేవారు. ప్రకృతిని ఆరాధించి, తిరిగి ఆ ప్రకృతికే స్వచ్ఛతను చేకూర్చే పరమ పవిత్ర పర్యావరణ చక్రమిది.

కానీ గత రెండు దశాబ్దాలుగా తీవ్ర వినియోగ తత్వం ప్రబలి, పండుగ నిర్వహణలో విపరీతమైన మార్పులు వచ్చాయి. సహజ పూల బతుకమ్మలకు బదులు ప్లాస్టిక్ బతుకమ్మలు ఊరూవాడా ప్రవేశించాయి. కొందరు నిమజ్జనం పేరిట జలవనరుల వద్దకు వెళ్లి, కేవలం ఆచారంగా నీటిని తాకించి ఆ ప్లాస్టిక్ బతుకమ్మను మళ్లీ ఇంటికి తెచ్చి అటకపై భద్రపరుచు కుంటున్నారు. దీనివల్ల పూలను పేర్చే సృజనాత్మకత, మట్టితోనూ చెట్లతోనూ ముడిపడిన భావోద్వేగ అనుబంధం పూర్తిగా నిర్వీర్యమైపోతున్నాయి.

మరీ ముఖ్యంగా, తరతరాల బతుకమ్మ పాటల స్థానాన్ని విపరీతమైన డీజేల హోరు, కర్ణకఠోర సౌండ్ సిస్టమ్స్ ఆక్రమించాయి. దీనికితోడు రసాయన రంగులు అద్దిన ప్లాస్టిక్ పూలు, థర్మాకోల్ వ్యర్థాలను నీటిలో పార వేయడం వల్ల పవిత్ర జలవనరులు విషతుల్యమై, జలచరాల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోంది.

ఈ సాంస్కృతిక సంక్షోభాన్ని అధిగమించాలంటే కేవలం ఆవేదన వ్యక్తం చేస్తే సరిపోదు. విస్తృత సామాజిక సంకల్పం, సమగ్ర కార్యాచరణ తక్షణావసరం. పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థినులకు ప్రాచీన బతుకమ్మ పాటల సాహిత్యం, వాటి అంతరార్థంపై ప్రత్యేక కార్య

స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధతపై
విశాఖపట్నం రేంజ్ ఐజీపీ సమీక్ష

విశాఖపట్నం, అక్టోబర్ 15: విశాఖపట్నం రేంజ్ ఇన్స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ గోపీనాథ్ జట్టి, విశాఖపట్నం రేంజ్ పరిధిలోని అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్, పోలవరం జిల్లా ఎస్పీ శ్రీ కె.చక్రవర్తి, ఐపీఎస్, అనకాపల్లి జిల్లా ఎస్పీ శ్రీ తుహిన్ సిన్హా, ఐపీఎస్, విజయనగరం జిల్లా ఎస్పీ .ఆర్.దామోదర్, , పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ మాధవ్ రెడ్డి, , శ్రీకాకుళం జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వర్ రెడ్డి, లతో స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధతపై సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆరు జిల్లాల ఎస్పీలు జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలను శాంతియుతంగా, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, చట్టబద్ధంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ముందస్తు చర్యలు చేపట్టాలని ఐజీపీ ఎస్పీలను ఆదేశించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, ఎన్నికలకు సంబంధించిన చట్టాలు, ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఖచ్చితంగా అమలు చేయాలని సూచించారు.

ఎన్నికల భద్రతపై ప్రత్యేక దృష్టి:

ప్రతి జిల్లాలోని పోలింగ్ కేంద్రాలు, సమస్యాత్మక ప్రాంతాలు, భద్రతా అవసరాలు, బందోబస్తు విధులు, శాంతిభద్రతల బాధ్యతలను పరిగణనలోకి తీసుకొని, బయటి జిల్లాల నుంచి ఎంతమంది పోలీస్ సిబ్బందిని సమీకరించాల్సి ఉంటుందో సమగ్రంగా అంచనా వేయాలని ఆదేశించారు. అవసరమైన అదనపు బలగాల వివరాలను ముందుగానే సిద్ధం చేసి, సిబ్బంది కేటాయింపు, విధుల విభజన, బలగాల మోహరింపు, సమన్వయానికి సంబంధించి పక్కా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ఎన్నికల సమయంలో పోలీస్ సిబ్బంది కొరత లేకుండా, ప్రతి జిల్లాలో తగినంత బలగాలను అందుబాటులో ఉంచి, ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగా జరిగేలా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎన్నికల సమయంలో హింస, బెదిరింపులు, ఘర్షణలు, ఇతర చట్టవ్యతిరేక కార్యకలాపాలను నిరోధించేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని, సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీస్ బలగాలను తగిన విధంగా మోహరించి, రిజర్వ్ బలగాలను అవసరమైన సమయంలో తక్షణమే వినియోగించేలా సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు.

గ్రేటర్ విశాఖ ఎన్నికల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు

స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత, పారదర్శక ఎన్నికలకు సమన్వయంతో పనిచేయాలి
ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు.. ఏర్పాట్లపై సమీక్షలో జిల్లా కలెక్టర్

విశాఖపట్నం, అక్టోబర్ 15: గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ రెండో సాధారణ ఎన్నికలను స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పటిష్ట ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎం. అభిషిక్త్ కిశోర్ ఆదేశించారు. ఎన్నికల సంఘం నిబంధనలు, మార్గదర్శకాలను తూచా తప్పకుండా పాటించాలని, సొంత నిర్ణయాలకు తావివ్వకుండా ప్రతి అధికారి తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని స్పష్టం చేశారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, జేసీ జి. విద్యాధరి తదితర అధికారులతో కలిసి జీవీఎంసీ ఎన్నికల సన్నద్ధత, భద్రతా ఏర్పాట్లు, వ్యయ పర్యవేక్షణ, పోలింగ్, కౌంటింగ్ పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జీవీఎంసీ పరిధిలోని 120 వార్డుల్లో 1,990 పోలింగ్ కేంద్రాలను 778 ప్రాంతాల్లో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొత్తం 18,37,901 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని, ఎన్నికల నిర్వహణలో సుమారు 8,000 మంది అధికారులు, సిబ్బంది భాగస్వాములు కానున్నారని పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియలో ప్రతి దశను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేందుకు ముందస్తు ప్రణాళికతో సిద్ధంగా ఉండాలని, విధుల్లో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వరాదని ఆదేశించారు. వచ్చే ఆదివారం నాటికి అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పన పూర్తి చేయాలన్నారు. తాగునీరు, మరుగుదొడ్లు, షేడ్, విద్యుత్ సౌకర్యం, సీసీ కెమెరాలు తదితర ఏర్పాట్లు ముందుగానే చేపట్టాలన్నారు. నోడల్, జోనల్ అధికారులు క్షేత్రస్థాయిలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించి, ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే నివేదించి పరిష్కరించాలని చెప్పారు. ప్రైవేట్ భవనాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల యజమానులు ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లయితే, నిబంధనల ప్రకారం ప్రత్యామ్నాయ భవనాల్లో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద వీడియో గ్రఫీ, వెబ్కాస్టింగ్ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

ఎన్నికల విధులు కేటాయించిన అధికారులు, సిబ్బందికి ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం శిక్షణ పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పోలింగ్ సిబ్బంది, మైక్రో అబ్జర్వర్లకు తమ విధులు, బాధ్యతలపై పూర్తి అవగాహన కల్పించాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను నిబంధనల ప్రకారం నిర్వహించాలని, తొలి శిక్షణ సమయంలో ఎన్నికల సిబ్బంది నుంచి ఫారం-22లను స్వీకరించి, పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియను పక్కాగా చేపట్టాలన్నారు. ఎన్నికల విధుల నుంచి ఎవరికీ మినహాయింపు ఉండదని స్పష్టం చేశారు. పోలింగ్ కు అవసరమైన బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పత్రాలు, ఇతర ఎన్నికల సామగ్రి పంపిణీ, తరలింపు, భద్రపరిచే ప్రక్రియలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. బ్యాలెట్ పత్రాల వర్గీకరణ, తరలింపు వంటి కీలక ప్రక్రియలను వీడియో చిత్రీకరించాలని, ఎన్నికల సామగ్రి పంపిణీ, స్వీకరణలో నిర్దేశిత విధానాలను ఖచ్చితంగా పాటించాలని ఆదేశించారు.

ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తక్షణమే అమలు చేయాలి

అధికారులకు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎం. అభిషిక్త్ కిశోర్ ఆదేశాలు

విశాఖపట్నం, అక్టోబర్ 14: ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తక్షణమే అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ అధికారులను ఆదేశించారు. రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులకు సంబంధించిన ఫ్లెక్సీలు, వాల్ పోస్టర్లు, హోర్డింగ్లను వెంటనే తొలగించాలని, విగ్రహాలకు ముసుగులు వేయడంతోపాటు శిలాఫలకాలు, ఇతర ఫలకాలపై పేర్లు కనిపించకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్లు (ఎస్ఎస్టీ), ఫ్లయింగ్ స్క్వాడ్లు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి పర్యవేక్షణ బృందాలు (ఎంసీసీ), ఎన్నికల వ్యయ పర్యవేక్షణ బృందాలను తక్షణమే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎన్నికల సామగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రాలు, కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్ల ఏర్పాట్లకు సంబంధించి రూట్ మ్యాప్లతో కూడిన సమగ్ర ప్రణాళికను సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. గత ఎన్నికల అనుభవాలు, నిర్దేశిత ప్రమాణాలను పరిగణనలోకి తీసుకుని సెన్సిటివ్, హైపర్ సెన్సిటివ్, క్రిటికల్ పోలింగ్ కేంద్రాలను గుర్తించి, సంబంధిత నివేదికను సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి చేపట్టాల్సిన అన్ని ముందస్తు ఏర్పాట్లను ఎలాంటి జాప్యం లేకుండా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేశారు.

ఏయూలో కలాం జయంతి వేడుకలు నిర్వహణ

ఆంధ్రవిశ్వవిద్యాలయం, అక్టోబర్ 15: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆరట్స్ కళాశాల వద్ద ఉన్న పూర్వ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహానికి ఆరట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జాలాది రవి పూలమాలవేసి అంజలి ఘటించారు. కలాం జయంతి వేడుకలను రాజనీతి శాస్త్రం, ప్రభుత్వ పాలనా శాస్త్రం హెచ్ ఓ డి ప్రొఫెసర్ పేటేటి ప్రేమానందం ఆధ్వర్యంలో నిర్వహించారు. డాక్టర్ ఏ.పి.జె. అబ్దుల్ కలాం జన్మదిన వేడుకలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏయూ ఆరట్స్ అండ్ కామర్స్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జాలది రవి మాట్లాడుతూ గతంలో ఏయూ కలాంకు గౌరవ డాక్టరేట్ అందించి గౌరవించిందన్నారు. ఆ విధంగా ఆయన ఏయూకు పూర్వ విద్యార్థిగా నిలచారన్నారు. భారత దేశం గర్వించే శాస్త్రవేత్తలతో ఒకరిగా ఆయన నిలుస్తారన్నారు. భారత దేశ రక్షణ వ్యవస్థను బలోపేతం చేయడంలో ఆయన చేసిన కృషి నిరుపమానమన్నారు.

ఆచార్య పేటేటి ప్రేమానందం మాట్లాడుతూ డాక్టర్ ఏ.పి.జె. అబ్దుల్ కలాం కష్టపడి చదువుకుని ఉన్నతంగా ఎదిగారన్నారు. దేశాన్ని అంతరిక్ష, రక్షణ రంగాలలో సమున్నతంగా తీర్చిదిద్దడంలో ఆయన కృషి ఎంతో ఉందన్నారు. దార్శనికతతో అందరితో కలసి పనిచేయడం, నిరాడంబర జీవనం, నిత్యం చిన్నారులను ప్రేరణ కలిగించే ప్రసంగాలతో ఆయన ప్రజల హృదయాలలో సుస్థిర స్థానం సంపాదించుకున్నారన్నారు. అటువంటి వ్యక్తుల జీవితాల నుంచి యువత స్ఫూర్తిని పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ప్రొఫెసర్ పి. అరుణ్ కుమార్, పరిశోధక విద్యార్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.

త్రిపురా సుందరి దేవి అలంకరణలో దర్శనం

కాట్రేనికోన అక్టోబర్ 15(మనం ప్రతినిధి): శ్రీ శ్రీ పట్టాభిరామ స్వామి ఆలయంలో కోలు వై యు న్న శ్రీ విజయ దుర్గ అమ్మవారి శ రన్నవరాత్రి మహోత్సవంలో బాగంగా 5 వ రోజు శ్రీ లలితా త్రిపురా సుందరి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా వివిధ రకాల గాజుల తో లలితా త్రిపురా సుందరి దేవీ గా అలంకరించారు.అమ్మవారి గాజుల అలంకారం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది 5 వ రోజు పూజ చేయించుకున్న దంపతులు 1.పెద్దిరెడ్డి శ్రీనివాస్, ఉమా గౌరి లక్ష్మీదంపతులు 2 .ముదునూరి రామ కృష్ణ రాజు, సత్యవతి దంపతులు అధిక సంఖ్యలో కుంకుమ పూజలు జరిగాయి. అనంతరం శత లలితా సహస్ర నామ (150,000)పారాయణం గ్రామ అడబడు చూలు చే నిర్వహించ డం జరిగింది. ఈ శత సహస్ర నామ పారాయణం కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు . అనంతర ప్రసాదవితరణ జరిగింది .

నేటి నుండి నామినేషన్ల స్వీకరణ

మేయర్ అభ్యర్థుల నామినేషన్లు జివిఎంసి ప్రధాన కార్యాలయంలో.
వార్డు అభ్యర్థుల నామినేషన్లు సంబంధిత జోనల్ కార్యాలయలలో స్వీకరణ.
జీవీఎంసీ కమిషనర్, అదనపు ఎన్నికల అథారిటీ కేతన్ గార్గ్

విశాఖపట్నం అక్టోబర్ -15: మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ రెండో సాధారణ ఎన్నికలు - 2026 నిర్వహణకు మేయర్, వార్డు అభ్యర్థులు తమ నామినేషన్లను నేటి నుండి దిగువ తెలిపిన ప్రాంతాలలో సమర్పించవలెనని జీవీఎంసీ కమిషనర్, అదనపు ఎన్నికల అథారిటీ కేతన్ గార్గ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబర్ 16 నుండి అక్టోబర్ 18 వరకు(ప్రతీ రోజు ఉ.గం.11 ల నుండి సా.గం.3) నామినేషన్లు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు.

మేయర్ ఎన్నికలు పోటీలో ఉండే అభ్యర్థులు తమ నామినేషన్లను జీవీఎంసీ ప్రధాన కార్యాలయం గ్రౌండ్ ప్లోర్ లో గల సిటీ ఆఫరేషన్ సెంటర్ (సిఒసి ఆఫీసు) మేయర్ ఎన్నికల రిటర్నింగ్ అధికారికి సమర్పించాలని తెలిపారు. అలాగే వార్డు అభ్యర్థుల నామినేషన్లను దిగువ తెలిపిన జోనల్ లో ఆయా జోనల్ కార్యాలయాలలో నామినేషన్లను స్వీకరించడం జరుగుతుందని కమిషనర్ తెలిపారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనలను పాటిస్తూ, నిర్ణీత తేదీలు, సమయాల్లో నామినేషన్లు దాఖలు చేయాలని కమిషనర్ తెలిపారు.

వ్యవసాయ రంగంలో ఉత్తమ క్షేత్రస్థాయి అధికారినిగా ఢిల్లీలో అవార్డు అందుకున్నపైలా సత్యవేణి

పాయకరావుపేట అక్టోబరు 15 మనం న్యూస్: ప్రపంచ మహిళా రైతు దినోత్సవం సందర్భంగా గురువారం ఢిల్లీలో మినిస్ట్రీ ఆఫ్ అగ్రికల్చర్ ఆధ్వర్యంలో జరిగిన ఒక కార్యక్రమంలో వ్యవసాయ రంగంలో ఉత్తమ సేవలందించినందుకుగానూ ఉత్తమ క్షేత్రస్థాయి అధికారినిగా పైలా సత్యవేణి అవార్డు అందుకున్నారు. సత్యవేణి ప్రస్తుతం వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ), విశాఖపట్నం జిల్లా పాయకరావుపేట బ్లాక్ అసిస్టెంట్ టెక్నాలజీ మేనేజరుగా విధులు నిర్వహిస్తున్నారు. గత 12 ఏళ్లుగా ఆత్మ పథకంలో పాయకరావుపేట డివిజన్లో సేవలు అందిస్తున్నారు. ఆత్మ పథకంలో భాగంగా ప్రదర్శన క్షేత్రాలు, ట్రైనింగులు, ఉత్తమ క్షేత్రస్థాయి సేవలు అనగా సాంకేతిక పరిజ్ఞానం, రైతు సంఘాలు, రైతు అనుకూల వ్యవసాయ పథకాల ప్రణాళికలు మరియు విజ్ఞాన యాత్రలు చేపట్టారు. అంతర్జాతీయ మహిళా రైతు దినోత్సవం సందర్భంగా ఢిల్లీలో ఉత్తమ క్షేత్రస్థాయి మహిళా అధికారినిగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు, సహోద్యోగులు సత్యవేణిని అభినందించారు.

కూటమి అభ్యర్థులు గెలుపుకు సమిష్టిగా కృషి చేయాలి

కాట్రేనికోన, అక్టోబర్ 15(మనం ప్రతినిధి): త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి తరుపున అభ్యర్థి ఏ పార్టీ వారైనా వారి గెలుపుకు కృషి చేయవలసిన అవసరం ఉందని మత్స్యశాఖకార్పొరేషన్ మాజీ చైర్మన్ నాగిడి నాగేశ్వరరావుపిలుపునిచ్చారు. కందికుప్ప లోని వాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ ఆకాశం శ్రీనివాస్ నివాస గృహం వద్ద జరిగిన టిడిపి విస్తృత స్థాయి సమావేశంలోటిడిపి నాయకులు పలువురు మాట్లాడారు.. అభ్యర్థి ఎవరైనా సరే కూటమి ధర్మం ప్రకారం గెలుపుకుకార్యకర్తలు కృషి చేయాలని అన్నారు.గత స్థానిక సంస్థల ఎన్నికల్లో దౌర్జన్యాల కారణంగా ఫలితాలు తారుమారు అయ్యాయని ఈసారి అన్ని పంచాయతీలు, జడ్పిటిసి, ఎంపీటీసీలు కూటమి గెలుచుకోవాలనిఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చెల్లి సురేష్,నడింపల్లి సుబ్బరాజు, విత్తనాల బుజ్జి, బండారు యేసు ,కాండ్రేగుల సత్య ప్రసాద్, వంగ దుర్గ బాబు, వెంట్రు సుధీర్, ఇసుకపట్ల వెంకటేశ్వర రావు ,మట్ట రమేష్, కముజు రాంబాబు, బడుగు పుల్లా రావు, కాశి శ్రీను, చికు రుమిల్లి చక్రధర్,పోలవరపు వెంకట రమణ, మాదే యోగేశ్వరి, నూకల మోహన్, జి మంగా రావు, మెల్లం సువర్ణ జ్యోతి, కోటిపల్లి సత్యనారాయణ, బక్కి నాగేశ్వరావు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి

మొదటి దశ నవంబర్ 26న , రెండవ దశ నవంబర్ 29న పోలింగ్.. కలెక్టర్ మహేష్ కుమార్ వెల్లడి

అమలాపురం అక్టోబర్ 15(మనం ప్రతినిధి): జిల్లాలో స్థానిక సంస్థల రెండో సాధారణ ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల ప్రక్రియ అక్టోబర్ 19న ఎన్నికల సంఘం నోటిఫికేషన్తో ప్రారంభమవుతుందని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్ గురువారం తెలిపారు. అక్టోబర్ 21న రిటర్నింగ్ అధికారులు ఎన్నికల ప్రకటన జారీ చేస్తారని, అక్టోబర్ 23 నామినేషన్ల స్వీకరణకు చివరి తేదీగా, అక్టోబర్ 24న నామినేషన్ల పరిశీలన, అక్టోబర్ 25న తిరస్కరించిన నామినేషన్లపై అప్పీల్, అక్టోబర్ 26న అప్పీళ్ల పరిష్కారం, అక్టోబర్ 27న అభ్యర్థిత్వాల ఉపసంహరణ, పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితా ప్రకటన ఉంటాయని పేర్కొన్నారు. నవంబర్ 3న పోలింగ్, అవసరమైతే నవంబర్ 4న తిరిగి పోలింగ్, నవంబర్ 5న ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన జరుగుతాయని తెలిపారు. పరోక్ష ఎన్నికల ప్రక్రియలో భాగంగా నవంబర్ 3న నోటిఫికేషన్ విడుదల చేసి, నవంబర్ 7వ తేదీలోగా సభ్యులకు నోటీసులు అందించి, నవంబర్ 11 లేదా 12న ప్రత్యేక సమావేశం నిర్వహించి ఎన్నికలు చేపడతారని వివరించారు.

గ్రామ పంచాయతీ ఎన్నికలు – మొదటి దశ నవంబర్ 26న పోలింగ్

గ్రామ పంచాయతీల్లో సర్పంచ్, వార్డు సభ్యుల

ఎన్నికలకు సంబంధించి మొదటి దశ నోటిఫికేషన్ నవంబర్ 13న విడుదల కానుందని కలెక్టర్ తెలిపారు. నవంబర్ 15న ఎన్నికల ప్రకటన జారీ చేస్తారని, నవంబర్ 17 నామినేషన్ల స్వీకరణకు చివరి తేదీగా, నవంబర్ 18న నామినేషన్ల పరిశీలన, నవంబర్ 19న తిరస్కరించిన నామినేషన్లపై అప్పీళ్లు, నవంబర్ 20న అప్పీళ్ల పరిష్కారం, నవంబర్ 21న అభ్యర్థిత్వాల ఉపసంహరణతో పాటు పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితా ప్రకటిస్తారని పేర్కొన్నారు. నవంబర్ 26న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ నిర్వహించి, అదే రోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన చేపడతారని తెలిపారు. అవసరమైతే నవంబర్ 27న తిరిగి పోలింగ్ నిర్వహిస్తారని, పరోక్ష ఎన్నికలకు నవంబర్ 13న నోటిఫికేషన్ విడుదల చేసి, నవంబర్ 26వ తేదీలోగా సభ్యులకు నోటీసులు అందించి, నవంబర్ 26 లేదా 27న ప్రత్యేక సమావేశం నిర్వహిస్తారని వివరించారు.

గ్రామ పంచాయతీ ఎన్నికలు – రెండో దశ నవంబర్ 29న పోలింగ్

రెండో దశ గ్రామ పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ నవంబర్ 16న విడుదలవుతుందని, నవంబర్ 18న ఎన్నికల ప్రకటన జారీ చేస్తారని కలెక్టర్ డా.ఆర్. మహేష్ కుమార్ తెలిపారు. నవంబర్ 20 నామినేషన్ల స్వీకరణకు చివరి తేదీగా, నవంబర్ 21న నామినేషన్ల పరిశీలన, నవంబర్ 22న తిరస్కరించిన నామినేషన్లపై అప్పీళ్లు, నవంబర్ 23న అప్పీళ్ల పరిష్కారం, నవంబర్ 24న అభ్యర్థిత్వాల ఉపసంహరణతో పాటు తుది అభ్యర్థుల జాబితా ప్రకటిస్తారని పేర్కొన్నారు. నవంబర్ 29న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ నిర్వహించి, అదే రోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన చేపడతారని తెలిపారు. అవసరమైతే నవంబర్ 30న తిరిగి పోలింగ్ నిర్వహిస్తారని, పరోక్ష ఎన్నికల ప్రక్రియలో భాగంగా నవంబర్ 16న నోటిఫికేషన్ విడుదల చేసి, నవంబర్ 29వ తేదీలోగా సభ్యులకు నోటీసులు అందించి, నవంబర్ 29 లేదా 30న ప్రత్యేక సమావేశం నిర్వహిస్తారని వివరించారు.

కోడ్ ఎఫెక్ట్ విగ్రహాలకు, శిలాఫలాకు ముసుగులు

కాట్రేనికోన అక్టోబర్ 15(మనం ప్రతినిధి): స్థానిక సంస్థలకు సంబంధించి రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో కాట్రేని కోన మండలంలో కోడ్ అమలు చేసే బాధ్యతను అధికారులు చేపట్టారు. దానిలో భాగంగా మండల హెడ్ క్వార్టర్ నందు ఉన్న ఫ్లెక్సీలను గురువారం తొలగించారు. అన్నా క్యాంటీన్ నందు ఉన్న విగ్రహాలకు, వైయస్సార్ విగ్రహానికి ముసుగులు వేశారు. శిలాఫలకాలను మునివేస్తున్నారు.మండల వ్యాప్తంగా ఈ కార్యక్రమం కొనసాగుతుందని అధికారులు చెబుతున్నారు.

శంఖవరం ఎంపీపీ పీఠంపై కూటమిలో ఆసక్తికర పోరు!

ఎంపీటీసీ, జడ్పీటీసీ అభ్యర్థుల ఎంపికపై కసరత్తు..
టీడీపీ సీనియర్ల మధ్య అంతర్గత పోటీ?

శంఖవరం, అక్టోబరు 15 మనం ప్రతినిధి: కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గంలోని శంఖవరం మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల సందడి మొదలైంది. ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు పోటీ చేయాలని భావిస్తున్న ఆశావహులు తమ ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది.

ముఖ్యంగా మండల పరిషత్ అధ్యక్షుడు (ఎంపీపీ) పదవిని దక్కించుకో వాలనే లక్ష్యంతో కూటమి వర్గాల్లోనే సమీకరణాలు ఆసక్తికరంగా మారుతున్నట్లు సమాచారం.

ఎంపీపీ పదవిపై ఇద్దరు టీడీపీ సీనియర్ల గురి!

శంఖవరం మండలంలో సుదీర్ఘకాలంగా రాజకీయాల్లో కొనసాగుతూ తమకంటూ గుర్తింపు తెచ్చుకున్న ఇద్దరు సీనియర్ టీడీపీ నాయకులు ఎంపీటీసీ సభ్యులుగా పోటీ చేసి, తదనంతరం ఎంపీపీ పదవిని దక్కించుకోవాలని వ్యూహరచన చేస్తున్నట్లు స్థానిక రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అయితే, ఈ ఇద్దరు నాయకులు ఎవరనే విషయంపై అధికారిక స్పష్టత లేదు. అభ్యర్థుల ఎంపిక, పార్టీ మద్దతు, గెలుపు అవకాశాలు వంటి అంశాలు రానున్న రోజుల్లో కీలకంగా మారనున్నాయి.

సీనియర్ నేత కనుసన్నల్లో అభ్యర్థుల ఎంపిక?

మండలంలో సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన ఓ సీనియర్ నాయకుడి కనుసన్నల్లో స్థానిక సంస్థల ఎన్నికల అభ్యర్థుల ఎంపికకు సంబంధించిన చర్చలు సాగుతున్నట్లు సమాచారం.

గ్రామాల వారీగా పార్టీ బలాబలాలు, నాయకుల వ్యక్తిగత ప్రభావం, స్థానికంగా ఉన్న సామాజిక సమీకరణాలు, కార్యకర్తల మద్దతు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని అభ్యర్థులను ఖరారు చేసే అవకాశముందని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

కూటమి పార్టీల మధ్య సర్దుబాట్లే కీలకం!

ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాల్లో ఏ పార్టీకి ఎన్ని స్థానాలు కేటాయించాలి? ఎవరికి అవకాశం కల్పించాలి? ఆశావహుల్లో ఎవరికి పార్టీ అండగా నిలవాలి? అనే అంశాలపై కూటమి నాయకత్వం తీసుకునే నిర్ణయాలు ఎన్నికల వ్యూహాన్ని ప్రభావితం చేయనున్నాయి. ఒకే స్థానానికి పలువురు పోటీ పడితే వారిని సమన్వయం చేయడం పార్టీ నాయకత్వానికి సవాలుగా మారే అవకాశం ఉంది.

రిజర్వేషన్లు, గెలుపు అవకాశాలే నిర్ణయాత్మకం!

ఎంపీపీ పదవిని ఆశిస్తున్న నాయకులకు ముందుగా ఎంపీటీసీ స్థానంలో పోటీ చేసే అవకాశం రావడం, ఆ స్థానం రిజర్వేషన్కు అనుకూలంగా ఉండడం, ఎన్నికల్లో విజయం సాధించడం వంటి అంశాలు కీలకం కానున్నాయి. అంతేకాకుండా ఎంపీపీ పదవి రిజర్వేషన్, ఎన్నికైన ఎంపీటీసీ సభ్యుల మద్దతు, పార్టీ అంతర్గత నిర్ణయాలు కూడా పదవి ఎవరికి దక్కుతుందనే విషయాన్ని నిర్ణయించనున్నాయి.

ప్రస్తుతం శంఖవరం మండలంలో అభ్యర్థుల ఎంపికపై జరుగుతున్న చర్చలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంటున్నాయి. ఆశావహుల ప్రయత్నాలు ఏ మేరకు ఫలిస్తాయి? ఇద్దరు సీనియర్ టీడీపీ నాయకుల్లో ఎవరికి పార్టీ అధిష్ఠానం మద్దతు లభిస్తుంది? ఎంపీపీ పీఠం దిశగా ఎవరు పైచేయి సాధిస్తారు? అన్నది రానున్న పరిణామాల్లో తేలాల్సి ఉంది.

గ్రామీణ మహిళా రైతు దినోత్సవం

తాడేపల్లిగూడెం అక్టోబర్ 15 (మనం న్యూస్): పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం వెంకటరామన్నగూడెం గ్రామంలో వైయస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో గురువారం జాతీయ అంతర్జాతీయ గ్రామీణ మహిళా రైతు దినోత్సవం నిర్వహించారు. డాక్టర్ కే. ధనుంజయరావు మాట్లాడుతూ వ్యవసాయం, ఆహార భద్రతలో గ్రామీణ మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. మహిళల సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాలను బలోపేతం చేయాలనే లక్ష్యంతో ఉద్యానవర్సిటీ, కేవీకే శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. అందరూ మహిళలను గౌరవించాలని తెలిపారు.

తాడేపల్లిగూడెం పురపాలక సంఘం ఎన్నికలు వాయిదా

తాడేపల్లిగూడెం అక్టోబర్ 15 (మనం న్యూస్): పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం పురపాలక సంఘం ఎన్నికలు ఇప్పట్లో జరిగే అవకాశాలు కనిపించడం లేదని తెలుస్తోంది. విలీన 5 గ్రామాల అంశం పై పలువురు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో పురపాలక ఎన్నికలు వాయిదా పడ్డాయి. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న తమ మున్సిపాలిటీకి ఈ సారైనా ఎన్నికలు జరుగుతాయా లేదా అని రాజకీయ పార్టీ నాయకులు , ప్రజలు తీవ్ర సందేహాలు, అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. తాడేపల్లిగూడెం పురపాలక సంఘం ఎన్నికలు సుమారు రెండు నెలల సమయము పట్టొచ్చని తాడేపల్లిగూడెం ఆర్డీవో సూర్యారావు , పురపాలక సంఘం కమిషనర్ ఏసుబాబు తెలిపారు.

ప్రముఖ రైస్ మిల్లర్ వేగేశ్న రంగరాజు కన్నుమూత

పాలకొల్లు, అక్టోబర్ 15,మనం ప్రతి నిధి: ప్రముఖ రైస్ మిల్లర్ వేగేశ్న రంగరాజు (75) గురువారం మధ్యాహ్నం ఆయన నివాసం పాలకొల్లు లో గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు భార్య, ఇరువురు కుమారులు ఉన్నారు. పాలకొల్లు పరిసర ప్రాంతాల్లోనే కాకుండా జిల్లా రైస్ మిల్లింగ్ పరిశ్రమలో అగ్రగామిగా కూడా ఉన్నారు. ఆయన కేవీఎం ఛాంబర్స్ పీజీ కళాశాలకు ముఖ్య దాత గా వున్నారు. ఆయన మృతి పట్ల పాలకొల్లు రైస్ మిల్లర్లు సంతాపం వ్యక్తం చేశారు. మంత్రి నిమ్మల రామానాయుడు, మాజీ ఎమ్మెల్సీ అంగర రామోహన్,కాస్మో కల్చరల్ స్పోరట్స్ కాంప్లెక్స్ చైర్మన్ గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు, మాంటి సోరీ స్కూల్, జూనియర్ కాలేజీ డైరెక్టర్ కేవీ కృష్ణ వర్మ, క్షత్రియ సంక్షేమ పరిషద్ సంఘం,రైస్ మిల్లర్స్ సంఘ అధ్యక్షులు జడ్డు గాంధీ బాబు, ఉపాధ్యక్షుడు పెన్మెత్స సత్యనారాయణ రాజు (సతీష్) కార్యదర్శి వేగేశ్న రామచంద్ర రాజు (రాంబాబు)సహాయ కార్యదర్శిలు మామిడి వెంకట శ్రీరంగరాజీవ్, సహాయ కార్యదర్శి దేవరపు అజయ్ కుమార్ కోశాధికారి అద్దేపల్లి రామచంద్రరావు (చందు) తమ సంతాపం వ్యక్తం చేశారు. ఛాంబర్స్ కళాశాల చైర్మన్ కారుమూరి నర్సింహ రావు, వివిధ సంఘాల వ్యాపారులు సంతాపం వ్యక్తం చేశారు.రంగరాజు అంత్య క్రియలు శుక్రవారం పాలకొల్లు లో జరుగ నున్నాయి.

ఘనంగా డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి వేడుక

నివాళులు అర్పించిన యునైటెడ్ కాపు వనిత క్లబ్

పాలకొల్లు, అక్టోబర్ 15(మనం ప్రతినిధి): భారత మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకుని పాలకొల్లు యునైటెడ్ కాపు వనిత క్లబ్ ఆధ్వర్యంలో శంభునిపేట లోని అబ్దుల్ కలాం హెల్త్ పార్కులో ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ.. 'మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా', 'పీపుల్స్ ప్రెసిడెంట్'గా ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన డాక్టర్ అబ్దుల్ కలాం దేశానికి చేసిన సేవలు, యువతకు అందించిన స్ఫూర్తి మరువలేనివని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకుని యువత దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు దేవరపు కాంచన మాల, కార్యదర్శి సిద్ధిరెడ్డి శైలజారాణి, కోశాధికారి తోట గాయత్రి, కానూరు దేవి, దేవరపు రామలక్ష్మి, గంధం మణి, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

లక్ష రూపాయలు ఆర్థిక సాయం అందజేసిన వూటుకూరి

అమలాపురం, అక్టోబర్ 15(మనం ప్రతినిధి): అమలాపురం రూరల్ మండలం బండారులంక గ్రామంలో చేనేత కుటుంబానికి చెందిన నల్లా దుర్గ ప్రసాద్ అనారోగ్యంతో చిన్న వయస్సులోనే మృతి చెందడం జరిగింది వారి భార్య ఇద్దరు చిన్న పిల్లలతో కుటుంబ పోషణ భారంగా మారింది వారి అభ్యర్థన మేరకు రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం, బండారులంక దేవాంగ సంక్షేమ సంఘం మరియు ప్రసాద్ మిత్రబృందం సేకరించిన ఆర్థిక సహాయం 1,00,200/- (లక్ష రెండు వందల రూపాయలు) వారి పిల్లలు పేరు మీద డిపాజిట్ చేసి వారి కుటుంబ సభ్యులకు గురువారం రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షులు వూటుకూరి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి చేతుల మీదుగా అందజేయడం జరిగింది... ఈ కార్యక్రమంలో పిచ్చిక శ్యామ్ ,బళ్ళ వెంకటేశ్వర రావు , ఇసుమర్తి లింగమూర్తి , జాన గణేష్ , కొండా శ్రీను , బిళ్ళ నాగరాజు ,గాడా మహేష్ , బళ్ళ చైతన్య ,నాసిక శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పండుగ పూట కార్మికులను పస్తులుండనీయకండి

మార్కెట్‌లో ఎక్కడికక్కడ పెరుకుపోయిన చెత్త.. వెంటనే జీతాలు చెల్లించండి

గజ్వేల్, అక్టోబర్ 15 మనం న్యూస్: ఇంటిగ్రేటెడ్ మార్కెట్లో పనిచేస్తున్న కార్మికులను పండుగ పూట బస్సులు ఉండనీయకుండా వెంటనే జీతాలు చెల్లించాలని బీఆర్ఎస్ పార్టీ గజ్వేల్ నియోజకవర్గం ఇంచార్జ్ ఒంటేరు ప్రతాపరెడ్డి డిమాండ్ చేశారు. గత ఆరు నెలలుగా కార్మికులకు మార్కెట్లో జీతాలు ఇవ్వకపోవడంతో ఆరు రోజులుగా కార్మికులు విధులను బహిష్కరించడం జరిగింది.దానితో మార్కెట్లో చెత్త ఎక్కడికక్కడ పేరుకుపోయింది. దుర్గంధం వేదజల్లడం తో పాటు ఈగలు దోమలు తాండవ మాడుతున్నాయి. విషయాన్ని తెలుసుకున్న ప్రతాప్ రెడ్డి మార్కెట్ కు బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలతో వెళ్లడం జరిగింది. అక్కడి పరిస్థితులను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ రికార్డ్ తీ గాని డొక్కాడని కష్టజీవుల యొక్క జీతాలను ఆపడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి వారి జీవితాలను వెంటనే అందించాలని లేకపోతే భారీ ఎత్తున ధర్నా చేస్తామని హెచ్చరించడం జరిగింది. ఇంటిగ్రేటెడ్ మార్కెట్లో ఏ ఒక్క అధికారి కూడా అందుబాటులో లేకపోవడంతో వెంటనే అక్కడ నుంచే అధికారులతో ఫోన్లో మాట్లాడి వెంటనే వారి జీతాలు అందేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ మున్సిపల్ చైర్మన్ గంగిశెట్టి చందన రవీందర్, వైస్ చైర్మన్ పద్మ నర్సింగరావు, కౌన్సిలర్ అత్తిలి శ్రీనివాస్,తో పాటు తదితరులు పాల్గొన్నారు.

22 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

వాజేడు, అక్టోబర్ 15,మనం ప్రతినిధి: భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు గురువారం వాజేడు మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా మండల స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి వివిధ శాఖల పనితీరు, అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై చర్చించారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు సక్రమంగా అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అనంతరం వాజేడు ఎంపీడీవో కార్యాలయం వద్ద 22 మంది అర్హులైన లబ్ధిదారులకు రూ.22,02,552 విలువైన కళ్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా గిరిజన ప్రాంతాల ప్రజలకు ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెంలో మున్సిపల్ వర్కర్స్ ధర్నా

తాడేపల్లిగూడెం అక్టోబర్ (15 మనం న్యూస్): తాడేపల్లిగూడెం పురపాలక సంఘం ఎదుట ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధ సంస్థ) ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు ధర్నా నిర్వహించారు.

మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు కి వినతిపత్రం అందజేశారు.ఈ ధర్నాలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీనివాస్ ఏఐటీయూసీ తాడేపల్లిగూడెం ఏరియా అధ్యక్షులు ఓ.వి.రాజు , లక్ష్మణరావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని మున్సిపాలిటీలు కార్పొరేషన్లలో స్వీపర్లు, పబ్లిక్ హెల్త్, ఇంజనీరింగ్ విభాగాల్లో తీవ్రమైన సిబ్బంది కొరత ఉందని తెలిపారు.

ఓటు హక్కు కీలకమైనది: కలెక్టర్ రాహుల్ శర్మ

భూపాలపల్లి అక్టోబర్ 15 మనం ప్రతినిధి: ప్రజాస్వామ్యవాసులు ఓటు హక్కు కీలకమైనదని అందుకే 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులను ఓటర్లుగా నమోదు చేసేందుకు అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. గురువారం నాడు ఆయన గోరి కొత్తపల్లి మండలం చెన్నపూర్ గ్రామంలోని 263వ నంబర్ పోలింగ్ కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ ప్రక్రియను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా, పూర్తి పారదర్శకతతో నిర్వహించాలని ఆదేశించారు. ఓటరు నమోదుకు వచ్చిన దరఖాస్తును పరిశీలించారు. ఇప్పటి వరకు ఎన్ని దరఖాస్తులు వచ్చాయి, ఓటర్ల జాబితా నుంచి తొలగించిన పేర్లు, కొత్త ఓటరు నమోదులు, ఓటరు వివరాల్లో మార్పులు, చేర్పులకు సంబంధించి అందిన దరఖాస్తుల వివరాలను బూత్ స్థాయి అధికారిని అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిశీలించి, రికార్డులను ఎప్పటికప్పుడు పక్కాగా నిర్వహించాలని సూచించారు. 16వ తేదీ శుక్రవారం కూడా అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు పేర్కొన్నారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు ఓటరు జాబితాలో నమోదు కొరకు ఫారం 6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ఇప్పటికే ఓటరుగా నమోదైన వారు తమ ఓటరు కార్డులో పేరు, చిరునామా తదితర వివరాల్లో తప్పులు ఉంటే సరిచేసుకోవడంతో పాటు, అవసరమైన మార్పులు, చేర్పుల కోసం సంబంధిత ప్రత్యేక పోలింగ్ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు చాలా కీలకమైనదని, అర్హత కలిగిన ప్రతి పౌరుడు తన ఓటు హక్కును వినియోగించుకునేలా ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలని ఆయన తెలిపారు. ఈ తనిఖీ కార్యక్రమంలో ఆర్డిఓ హరికృష్ణ, తహసీల్దార్ హేమ, సర్పంచ్ భిక్షపతి, బిఎల్ఓ పాల్గొన్నారు.

లలితా త్రిపుర సుందరి దేవి గా అమ్మ వారు



గూడురు, అక్టోబర్ 15(మనంన్యూస్)ః దేవాదాయ ధర్మదాయ శాఖ. కర్నూలు జిల్లా గూడూరు మండలం,కే.నాగలాపురం గ్రామం నందు వెలసినశ్రీ సుంకులా పరమేశ్వరి దేవస్థానం లో దసరా నవరాత్రుల మహోత్సవం సందర్భంగా దేవస్థానం నందు ఉదయం హోమాలు నిర్వహించారు.

ఐదోవ రోజు సాయంత్రం లలితా త్రిపుర సుందరి దేవి గా అమ్మ వారి ని అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఈ కార్యక్రమం లో ఆలయ ఈఓ రాధ కృష్ణ గారు ఆలయ వైస్ చైర్మన్ గోపాల్ రెడ్డి

ఆలయ కమిటీ సభ్యులు తలారి సుజాత, వెంకట రాముడు, బండారి లక్ష్మి దేవి, లబ్బు అనిత, సి .మద్దమ్మ ఏరకలి మద్దమ్మ, గారు,మరియు

ఆలయ అర్చకులు కృష్ణ, వెంకటేష్ మరియు గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు ఆలయ సిబ్బందికేశవ పాల్గొన్నారు.

కలశయాత్రను ప్రారంభించిన మంత్రి టీజీ భరత్

అమ్మవారి ఆశీస్సులతో సమృద్ధిగా వర్షాలు కురిసి ప్రజలు సంతోషంగా ఉండాలి మంత్రి టీజీ భరత్

కర్నూలు అక్టోబర్ 15మనం న్యూస్ఃి కర్నూలు నగరంలోని రాంబొట్ల దేవాలయం వద్ద కలశయాత్రను రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార శుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్ ప్రారంభించారు. చిన్న అమ్మవారి శాలలో కొలువైన శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారికి మూలా నక్షత్రం సందర్భంగా 108 కలశాలతో తీసుకొచ్చిన పవిత్ర జలాలతో అభిషేకం నిర్వహించేందుకు ఈ కలశయాత్ర చేపట్టారు. మహిళలు రాంబొట్ల దేవాలయం నుంచి చిన్న అమ్మవారి శాల వరకు 108 కలశాలతో ఊరేగింపుగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ.. ఎన్నో దశాబ్దాలుగా ఈ ఆచారాన్ని భక్తులు కొనసాగించడం అభినందనీయమన్నారు. అమ్మవారి ఆశీస్సులతో సమృద్ధిగా వర్షాలు కురిసి, పంటలు బాగా పండి, రైతులందరూ సంతోషంగా ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. చిన్న అమ్మవారి శాల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కలశయాత్రలో కమిటీ చైర్మన్ టీజీ శివరాజు, అధ్యక్షుడు జూటూరు గోపాలయ్య, కార్యదర్శి చిలకలూరి నందకిషోర్, ఉపాధ్యక్షుడు శేషగిరి శెట్టి, మహిళా విభాగం నాయకురాలు జ్ఞానేశ్వరమ్మతో పాటు పలువురు కమిటీ సభ్యులు, భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

దుర్గమ్మ నిమర్జనంలో డీజేలకు అనుమతి లేదు

సీఐ వెంకటేశ్వరరావు

బేతంచేర్ల అక్టోబర్ 15 (మనం న్యూస్): పట్టణంలో సీఐ వెంకటేశ్వరరావు పోలీస్ స్టేషన్ ఆవరణంలో దుర్గ మాత విగ్రహాలు ఏర్పాటుచేసిన కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు సమావేశంలో సిఐ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ దుర్గామాత నిమర్జనం లో డీజేలు అనుమతి లేదు వివిధ సాంస్కృతి కార్యక్రమాలతో అమ్మవారి శోభయాత్ర నిర్వహించాలని ఎవరైనా నియమనిబంధనలు ఉల్లంఘించిన కఠిన చర్యలు తప్పవని అన్నారు.

నాపరాల ట్రాక్టర్ బోల్తా వ్యక్తికి తీవ్ర గాయాలు

బేతంచేర్ల, అక్టోబర్ 15 (మనం న్యూస్)ః బేతంచేర్ల నుండి బనగానపల్లె కి వెళ్లే రహదారి లో ఉన్న గులాయిల మలుపు వద్ద నాపరాయి లోడుతో వస్తున్న ట్రాక్టర్ బోల్తా వ్యక్తికి తీవ్ర గాయాలు పలుకూరు నుండి బేతంచేర్లకు నా నాపరాయి లోడుతో వస్తున్న ట్రాక్టర్ గులాయి మలుపుల వద్ద ప్రమాదవశాత్తు బోల్తా పడడంతో లోడింగ్ చేసే వ్యక్తి వీరాంజనేయులు కు తీవ్ర గాయాలు కావడంతో పట్టణంలో ఉన్న ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు చికిత్స నిమిత్తం కర్నూల్ ప్రభుత్వ వైద్యశాలకు కు తరలించారు

డీలర్ల సమస్యలను పరిష్కరించాలి

- జెసి, డిఎస్ఓ, లకు, వినతి

ఎమ్మిగనూరు, అక్టోబర్ 15 మనం న్యూస్: రేషన్ డీలర్ల సమస్యలను పరిష్కరించాలని కర్నూల్ జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్ డిఎస్ఓ రాజా రఘువీర్, లకు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు దీవి లీల మాధవరావు పిలుపుమేరకు గురువారం రేషన్ డీలర్లు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని డీలర్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు మహబూబ్ బాషా, కార్యనిర్వాహక అధ్యక్షురాలు, హంతుల్లాబి ,అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మహబూబ్ బాషా, ప్రతినిధులు రమణ గౌడ్, తాయప్ప, వై ఈరన్న, మధుసూదన్, మాట్లాడుతూ డీలర్ల న్యాయమైన డిమాండ్లను, సమస్యలను వెంటనే పరిష్కరించాలని డీలర్లను అన్ని విధాల ఆదుకోవాలని హితువు పలికారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన క్యూఆర్ కోడ్ విధానం ఇటు కార్డు దారులకు, ఇటు డీలర్లకు, ఇటు లారీ హమాలీలకు తీవ్ర జాప్యం జరగడంతో పాటు కొన్ని బ్యాగులకు స్కానింగ్ జరగక ఆ బ్యాగులు కార్డు దారులకు పంపిణీకి నోచుకోక ప్రతి గ్రామంలో ప్రతి వార్డుల్లో సమస్యలు నెలకొన్నాయి దీంతో డీలర్ల ఇబ్బందులు చెప్పాల్సిన అవసరం లేదు. దీనికి తోడు పనికి తగ్గ గౌరవేతనం లేక, కమిషన్లు చాలక, సక్రమంగా తూకాలు అందక, గతంలో ఇచ్చిన గన్ని బ్యాగుల డబ్బులు అందక, గన్ని బ్యాగుల లో పనిచేసే డీలర్లకు 2019, జీవో నెంబర్. 5 వెంటనే అమలు చేయాలి. ఈ కార్యక్రమంలో , డీలర్లు మధు, అబ్బాస్, వెంకటేశప్ప ట్రెజరరీ భాజాముద్దీన్, రఖీబ్, నాగూర్ భాష, సాజిదుల్లా, చంద్రశేఖర్, ఆదమలి, మధు, మన్సూర్, వెంకటరాముడు, రామకృష్ణ, శాంత శీన, అబ్బాస్ , గంగన్న, రాము, రాబియా, శివ తదితరులు పాల్గొన్నారు.

గాయత్రి దేవిగా కామేశ్వరి అమ్మవారు

మహానంది, అక్టోబర్15,మనంన్యూస్: గాయత్రి దేవిగా శ్రీ కామేశ్వరీ అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. దేవి నవరాత్రులలో భాగంగా ఐదవ రోజు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం యగశాలలో దాతలు పాల్గొనగా ఈఓ శ్రీనివాస రెడ్డి ఆదేశాల మేరకు వేదపండితులు రవిశంకర్ అవధాని, నాగేశ్వర శర్మ, శాంతారాం బట్,హనుమంతు శర్మల ఆధ్వర్యంలో ఋత్వికులు, అర్చకులు గణపతి పూజ, పుణ్యాహవాచనం, అనుజ్ఞ, దీక్షాధారణ, ఋత్విక్వారున, అఖండ దీప స్థాపన, అగ్నిప్రతిష్టాపన, నవదుర్గ కలశ స్థాపన, తదితర పూజలను నిర్వహించారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన మయూరా వాహనం పై శ్రీ స్కందమాతా అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ మౌళీశ్వర రెడ్డి, పాలక మండలి సభ్యులు, ఏ ఈఓ మధు, సూపర్డెన్స్ శశిధర్ రెడ్డి, నీలఖంటేశ్వర రాజు,సుబ్బారెడ్డి, టెంపుల్ ఇన్స్పెక్టర్ మల్లయ్య, ఆలయ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

- ఎన్నికల కోడ్ కచ్చితంగా అమలు
- కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి

కర్నూలు, అక్టోబర్ 15 (మనం న్యూస్): జిల్లాలో పట్టణ స్థానిక సంస్థలు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, గ్రామ పంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి తెలిపారు. గురువారం కలెక్టరేట్లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎన్నికల షెడ్యూల్, నామినేషన్ల స్వీకరణ, పోలింగ్, ఓట్ల లెక్కింపు వివరాలను వెల్లడించారు. కర్నూలు నగరపాలక సంస్థ, ఎమ్మిగనూరు, ఆదోని మున్సిపాలిటీలు, గూడూరు నగర పంచాయతీ ఎన్నికలకు అక్టోబర్ 14న నోటిఫికేషన్ విడుదలైందని తెలిపారు. అక్టోబర్ 16 నుంచి 18 వరకు నామినేషన్లు స్వీకరిస్తారని, అక్టోబర్ 28న పోలింగ్, 30న ఓట్ల లెక్కింపు ఉంటుందని వివరించారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు అక్టోబర్ 19న నోటిఫికేషన్ విడుదల కానుందని, నవంబర్ 3న పోలింగ్, నవంబర్ 5న ఓట్ల లెక్కింపు నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామ పంచాయతీ ఎన్నికలను మూడు దశల్లో నిర్వహించేందుకు షెడ్యూల్ రూపొందించినట్లు వెల్లడించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని రాజకీయ పార్టీలు, అభ్యర్థులు తప్పనిసరిగా పాటించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదుల కోసం 1800 425 4299 నంబర్ను సంప్రదించాలని సూచించారు. ఈ సమావేశంలో కర్నూలు నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు, జిల్లా పరిషత్ సీఈవో సుధాకర్ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి భాస్కర్ పాల్గొన్నారు.

శాంతి భద్రతలే లక్ష్యం

ఎస్ ఐ శివాంజల్

మహానంది, అక్టోబర్15,మనంన్యూస్: శాంతిభద్రతలే లక్ష్యమని ఎస్ ఐ శివాంజల్ తెలిపారు. గురువారం మహానంది ఎస్ ఐ గా బాధ్యతలు చేపట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలం లో ప్రజలు ఏదైనా సమస్య లు వుంటే నేరుగా స్టేషన్ కు వచ్చి సమస్యను పరిష్కరించుకోవాలని కోరారు.ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న ఎస్ ఐ రామ్మోహన్ రెడ్డి బదిలీపై ఆళ్లగడ్డ రూరల్ పోలీస్ స్టేషన్ కు వెళ్లగా కర్నూలు టౌన్ పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న ఈయనను ఉన్నతాధికారులు బదిలీ చేయడంతో బాధ్యతలు చేపట్టినట్లు తెలిపారు. అంతకుముందు శ్రీకామేశ్వరీ దేవి సహిత మహానందీశ్వర స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆనవాయితి ప్రకారం వేదపండితులు శాంతారాం బట్ వేద మంత్రోచ్చారణ మధ్య టెంపుల్ ఇన్స్పెక్టర్ మల్లయ్య స్వామివారి ప్రసాదాలను అందజేశారు. వారివెంట హెడ్ కానిస్టేబుల్ మల్లికార్జున, కానిస్టేబుళ్లు నారాయణ స్వామి, జనార్దన్, తదితరులు వున్నారు.

ఉద్యోగులు, సీనియర్ సిటిజన్ల సంక్షేమమే ప్రధాన లక్ష్యం

అనంతపురం, కలెక్టరేట్ అక్టోబర్ 15: మనం న్యూస్: ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరించడమే ప్రధాన లక్ష్యమని ఎ.పి. ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ (అకౌంట్స్ అండ్ ఎంటైటిల్మెంట్స్), ఆంధ్రప్రదేశ్ శ్రీమతి శాంతి ప్రియ పేర్కొన్నారు. అనంతపురం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవన్ లో రెండవ రోజు గురువారం ఉదయం నుండి మధ్యాహ్నం వరకు నిర్వహించిన పెన్షన్, జీపీఎఫ్ అదాలత్ విజయవంతంగా ముగిసింది. రెండు రోజుల పాటు నిర్వహించిన ఈ కార్యక్రమంలో పెన్షనర్లు, ఉద్యోగుల నుంచి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అసిస్టెంట్ కలెక్టర్ సుయాష్ కుమార్ హాజరయ్యారు. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి అసిస్టెంట్ కలెక్టర్ మాట్లాడుతూ, సీనియర్ సిటిజన్లను గౌరవించడం మనందరి బాధ్యత అని తెలిపారు. పెద్దలను గౌరవించే సమాజం గొప్ప సమాజంగా నిలుస్తోందన్నారు. ఉద్యోగ విరమణ చేసిన సిబ్బంది తమ సేవా కాలంలో ప్రభుత్వానికి అందించిన సేవలు ఎంతో కీలకమైనవని పేర్కొన్నారు. జిల్లాలోని పెన్షనర్ల సంక్షేమం కోసం ఇలాంటి కార్యక్రమాన్ని నిర్వహించడం గొప్ప చొరవ అని ప్రశంసించారు. గత 70 సంవత్సరాల కాలంలో ఈ తరహా కార్యక్రమం తొలిసారిగా నిర్వహిస్తున్నట్లు తెలుసుకుని సంతోషం వ్యక్తం చేశారు. భవిష్యత్తులోనూ ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించాలని ఆకాంక్షించారు.

కర్నూలు మండలంలో వైఎస్సార్సీపీ ఎన్నికల సన్నాహక సమావేశం

- స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తం.. నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం

గూడూరు , అక్టోబర్ 15 (మనం న్యూస్): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధమయ్యే దిశగా వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలతో కర్నూలు మండలంలో ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. మాజీ కుడా చైర్మన్, కోడుమూరు నియోజకవర్గ సమన్వయకర్త కోట్ల హర్షవర్ధన్రెడ్డి నివాసంలో ఈ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కోడుమూరు నియోజకవర్గ వైఎస్సార్సీపీ ఇన్చార్జి డాక్టర్ ఆదిమూలపు సతీష్, మాజీ ఎమ్మెల్యే మణి గాంధీ, వంశీధర్రెడ్డి, వాసు, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు. రాబోయే ఎంపీటీసీ, జెడ్పీటీసీ, ఎంపీపీ, సర్పంచ్ ఎన్నికల సన్నద్ధతపై నాయకులు, కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. గ్రామాల వారీగా ఎన్నికల సన్నద్ధతపై చర్చ

సమావేశంలో భాగంగా గ్రామాల వారీగా రిజర్వేషన్లు, ఎన్నికల నిబంధనలు, ఎన్నికల ప్రక్రియపై నాయకులు, కార్యకర్తలకు అవగాహన కల్పించారు. క్షేత్రస్థాయిలో పార్టీ కార్యకలాపాలను సమన్వయంతో నిర్వహిస్తూ, గ్రామాల్లో ప్రజలతో నిరంతరం మమేకం కావాలని సూచించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని, పార్టీ బలోపేతానికి సమష్టి కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ కోసం కష్టపడే కార్యకర్తలకు అండగా ఉంటామని నాయకులు భరోసా ఇచ్చారు.

ఈ సమావేశంలో కర్నూలు మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన మాజీ జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, పార్టీ ముఖ్య నాయకులు, కమిటీ సభ్యులు, కార్యకర్తలు, ఎన్నికల్లో పోటీ చేయాలనే ఆశావహులు పాల్గొన్నారు.

గూడూరు నగర పంచాయతీ చైర్పర్సన్ అభ్యర్థిగా డమామ్ సునీత భాయ్!

కూటమి తరపున బీజేపీకి అవకాశం.. టీడీపీ, జనసేన, బీజేపీ నేతల నిర్ణయం

గూడూరు, అక్టోబర్ 15 (మనం న్యూస్): గూడూరు నగర పంచాయతీ చైర్పర్సన్ అభ్యర్థిగా బీజేపీకి చెందిన డమామ్ సునీత భాయ్ను ఎంపిక చేసినట్లు కూటమి నేతలు వెల్లడించారు. తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతా పార్టీలు కలిసి కూటమి అభ్యర్థిగా ఆమె పేరును ఖరారు చేసినట్లు గురువారం సమాచారం వెలువడింది. గూడూరు పట్టణంలో తెలుగుదేశం పార్టీకి బలమైన రాజకీయ స్థానం ఉన్నప్పటికీ, కూటమి పార్టీల మధ్య కుదిరిన అవగాహనలో భాగంగా చైర్పర్సన్ పదవిని బీజేపీకి కేటాయించినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో బీజేపీ తరపున డమామ్ సునీత భాయ్ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసినట్లు కూటమి నేతలు తెలిపారు. కూటమి పార్టీల మధ్య పదవుల కేటాయింపులో భాగంగా తీసుకున్న ఈ నిర్ణయంతో గూడూరు నగర పంచాయతీ చైర్పర్సన్ అభ్యర్థిగా డమామ్ సునీత భాయ్ పేరు తెరపైకి వచ్చింది. ఈ పరిణామం స్థానిక రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

యువత ప్రభుత్వం అందిస్తున్న ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

- టీడీపీ ఇన్చార్జ్ రాఘవేంద్ర రెడ్డి

మంత్రాలయం అక్టోబర్ 15,మనం న్యూస్ : నిరుద్యోగ యువత కూటమి ప్రభుత్వం అందిస్తున్న ఉద్యోగ అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలని మంత్రాలయం నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జ్ రాఘవేంద్ర రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మండల పరిధిలోని మాధవరం గ్రామంలోని తెదేపా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి రోజు నుంచే నిరుద్యోగ యువత ఆకాంక్షలకు పెద్దపీట వేస్తూ విద్యాశాఖలో చారిత్రాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టిందన్నారు. వచ్చే జనవరి లోగా మరో 2,721 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి రెండు డీఎస్సీ నోటిఫికేషన్లు జారీ చేసి లక్షలాది మంది యువతీ యువకుల కొలువుల కలను కూటమి ప్రభుత్వం సాకారం చేసిందన్నారు. అధికారంలో ఉన్న సమయంలో ఒక్క డీఎస్సీ కూడా ప్రకటించకుండా నిరుద్యోగులను మోసం చేసిన వైఎస్సార్సీపీ ప్రభుత్వ వైఖరిని ప్రజలు గుర్తుంచుకోవాలని సూచించారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తోందని అన్నారు.

సత్యసాయి మహాసమాధి వద్ద విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న

పుట్టపర్తి, అక్టోబరు 15 మనం న్యూస్ : ఆధ్యాత్మిక క్షేత్రం పుట్టపర్తి మరోసారి సినీ ప్రముఖుల రాకతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రముఖ సినీ నటుడు విజయ్ దేవరకొండ, నటి రష్మిక మందన్న దంపతులు పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయాన్ని సందర్శించి, భగవాన్ శ్రీ సత్యసాయి బాబా మహాసమాధిని దర్శించుకున్నారు. ఆధ్యాత్మిక వాతావరణంలో సాగిన వీరి పర్యటన సినీ అభిమానులతో పాటు సత్యసాయి భక్తుల్లోనూ ఆసక్తిని రేకెత్తించింది. ప్రశాంతి నిలయానికి చేరుకున్న విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న దంపతులకు సత్యసాయి ట్రస్టు సభ్యులు సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం వారు సాయి కుల్వంత్ మందిరంలో భగవాన్ శ్రీ సత్యసాయి బాబా మహాసమాధిని దర్శించుకుని నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రశాంతి నిలయంలోని ఆధ్యాత్మిక వాతావరణంలో కొంత సమయం గడిపారు. అనంతరం పూర్ణచంద్ర ఆడిటోరియంలో నిర్వహిస్తున్న యజ్ఞ కార్యక్రమంలో పాల్గొన్నారు. విజయ్ దేవరకొండకు పుట్టపర్తితో ప్రత్యేక అనుబంధం ఉంది. గతంలో ఆయన సత్యసాయి విద్యాసంస్థల్లో విద్యనభ్యసించారు. విద్యార్థి దశ నుంచే పుట్టపర్తితో ఏర్పడిన అనుబంధం ఆయన జీవితంలో ఈ ప్రాంతానికి ప్రత్యేక స్థానాన్ని కల్పించింది. ఈ నేపథ్యంలో విజయ్ దేవరకొండ తన సతీమణి రష్మిక మందన్నతో కలిసి ప్రశాంతి నిలయాన్ని సందర్శించడం ప్రాధాన్యత సంతరించుకుంది.

ఎన్నికల నియమావళిని పాటించాలి

అభ్యర్థులు, నాయకులకు పత్తికొండ డీఎస్పీ వంశీధర్ గౌడ్ సూచన

పత్తికొండ, అక్టోబర్ 15 (మనం న్యూస్): ఆంధ్రప్రదేశ్లో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థులు, రాజకీయ నాయకులు, వారి అనుచరులు ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలని పత్తికొండ డీఎస్పీ వంశీధర్ గౌడ్ సూచించారు. ఓటర్లకు నగదు, మద్యం, బహుమతులు పంపిణీ చేయరాదని, కులమత విద్వేషాలు రెచ్చగొట్టే ప్రసంగాలు చేయకూడదని తెలిపారు. ప్రభుత్వ వనరులను ఎన్నికల ప్రచారానికి వినియోగించరాదని, అనుమతి లేకుండా ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేయకూడదని హెచ్చరించారు. మైకుల వినియోగానికి నిబంధనలు పాటించాలని, నగదు రవాణా సమయంలో తగిన ఆధారాలు కలిగి ఉండాలని సూచించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అందరూ సహకరించాలని కోరారు.

కివీస్‌తో వన్డే సిరీస్.. బుమ్రాకి రెస్ట్?

ప్రస్తుతం టీమ్‌ఇండియా వెస్టిండీస్ తో టీ20 సిరీస్ ను ఆడుతోంది. శనివారం చివరి మ్యాచ్ జరగనుంది. ఇది ముగిసిన తర్వాత.. భారత జట్టు న్యూజిలాండ్ పర్యటనకు వెళ్లనుంది. అక్కడ ఐదు టీ20లు, ఐదు వన్డేలు, రెండు టెస్టులను ఆడనుంది. ఇప్పటికే టీ20 సిరీస్ కోసం స్క్వాడ్ను బీసీసీఐ సెలక్షన్ కమిటీ ప్రకటించింది. మరో రెండు లేదా మూడు రోజుల్లో వన్డే సిరీస్ కోసం జట్టును ప్రకటించే అవకాశం ఉంది. ఈ క్రమంలో జస్ ప్రీత్ బుమ్రాకు వన్డే సిరీస్ నుంచి విశ్రాంతి ఇస్తారనే కథనం బయటకొచ్చింది. అతడి గాయం ఏమైనా తిరగబెట్టిందా? అనే అనుమానం రాకమానదు. కానీ, అలాంటిదేమీ లేదని.. టెస్టు సిరీస్ కోసమే ఈ నిర్ణయం తీసుకొనే అవకాశం ఉందని క్రికెట్ వర్గాలు పేర్కొన్నాయి.

''బుమ్రా పూర్తి స్థాయిలో ఫిట్గా ఉన్నాడు. కివీస్ పర్యటన సుదీర్ఘమైంది. ఇక్కడ ఏ సిరీస్కు ప్రాధాన్యత ఇవ్వాలనేది చూస్తాం. మిగతా రెండింటితో పోలిస్తే టెస్టు సిరీస్ ముఖ్యమైంది. వన్డేల నుంచి టెస్టు క్రికెట్ పై వెంటనే ఫోకస్ చేయడం చాలా కష్టమైంది. కేవలం కివీస్ పర్యటనకు మాత్రమే కాదు. వచ్చే ఏడాది బోర్డర్ - గావస్కర్ ట్రోఫీ కూడా ఉంది. ద్వైపాక్షిక సిరీస్ ల కోసం అతడితో పరిమిత ఓవర్ల క్రికెట్ ఎక్కువగా ఆడించకూడదు. ప్రపంచ టెస్టు ఛాంపియన్ షిప్ చాలా ఇంపార్టెంట్. దానిని దృష్టిలో ఉంచుకొనే ప్రణాళికలు సిద్ధం చేస్తాం'' అని బీసీసీఐ వర్గాలు పేర్కొన్నాయి. అక్టోబర్ 22 నుంచి టీ20లు ప్రారంభమై.. నవంబర్ 1తో ముగుస్తాయి. ఇక వన్డేలు నవంబర్ 4 నుంచి మొదలై 15వ తేదీ వరకూ జరుగుతాయి. నవంబర్ 19న తొలి టెస్టు, నవంబర్ 27న రెండో టెస్టు ప్రారంభమవుతాయి.

డబ్ల్యూటీసీ ఫైనల్ కు వెళ్లాలంటే?

ప్రపంచ టెస్టు ఛాంపియన్ షిప్ నాలుగో సీజన్ లో భారత్ ఫైనల్ కు చేరుకోవాలంటే రాబోయే ప్రతి మ్యాచూ కీలకమైందే. కివీస్ ను తమ సొంత గడ్డపై ఎదుర్కోవడం ఏ జట్టుకైనా కష్టమే. ఇప్పుడు ఆ కఠిన పరీక్ష భారత్ ముందుంది. రెండు టెస్టుల సిరీస్ ను కోల్పోకుండా విజేతగా నిలిస్తేనే.. టీమ్‌ఇండియా డబ్ల్యూటీసీ టేబుల్ లో ముందుకొస్తుంది. ప్రస్తుతం భారత్ 51.52 శాతంతో ఐదో స్థానంలో ఉంది. ఆస్ట్రేలియా (80%), దక్షిణాఫ్రికా (75%), న్యూజిలాండ్ (72.22 శాతం), బంగ్లాదేశ్ (55.56 శాతం) ముందున్నాయి. కివీస్తో రెండు టెస్టుల సిరీస్ను 2-0 తేడాతో గెలిస్తే మాత్రం కనీసం మూడో ప్లేస్కు వచ్చేందుకు అవకాశం ఉంది. ఒక్కటి ఓడినా భారత్ ఫైనల్ రేసు నుంచి ఇంకా వెనుకబడిపోవడం ఖాయం. ఆ తర్వాత ఆసీస్ తో బోర్డర్ - గావస్కర్ ట్రోఫీ కూడా ఉంది. అందుకోసమే బుమ్రా వంటి కీలకమైన బౌలర్ కు వన్డే సిరీస్ నుంచి విశ్రాంతి ఇచ్చి.. టెస్టుల్లోనే ఆడించాలనేదే మేనేజ్ మెంట్ ప్రణాళికగా ఉంది. తొలి రెండు స్థానాల్లో ఉన్న జట్లకే ఫైనల్ లో ఆడే అవకాశం ఉంటుంది.

మాకొద్దు ఆ సెలక్టర్ పదవి.. తిరస్కరించిన ఇద్దరు మాజీలు!

బీసీసీఐ నుంచి ఏదైనా పదవి ఆఫర్ వచ్చిందంటే ఎవరైనా ఎగిరి గంతేస్తారు. ప్రపంచంలోనే అత్యంత సంపద కలిగిన క్రికెట్ బోర్డు ఇదే మరి. ఎందుకో గానీ, ఈసారి మాత్రం ఈ పదవులపై పెద్దగా ఆసక్తి కన్పించట్లేదు. బీసీసీఐ ఇటీవల సెలక్టర్ పదవి కోసం దరఖాస్తులను ఆహ్వానించింది. ఈపాటికే భారత మాజీ క్రికెటర్ల నుంచి చాలా దరఖాస్తులు వచ్చి ఉంటాయని అనుకోవడం సహజమే. కానీ, అలా జరగలేదు. ఓ ఇద్దరు మాజీలైతే ఏకంగా తమ వద్దకు వచ్చిన ఆఫర్ ను కూడా తిరస్కరించారని వార్తలూ వస్తున్నాయి. వారిద్దరికి వందకుపైగా టెస్టులు ఆడిన అనుభవం ఉందని సమాచారం. నాలుగేళ్లపాటు చీఫ్ సెలక్టర్ గా పనిచేసిన అజిత్ అగార్కర్ పదవీ కాలం అక్టోబర్ 4తో ముగిసింది. ఆ వెంటనే బీసీసీఐ వెస్ట్ జోన్ నుంచి సెలక్టర్ పదవి కోసం దరఖాస్తులను ఆహ్వానించింది. అక్టోబర్ 14 సాయంత్రం 5 గంటలతో గడువు ముగిసింది. రమేశ్ పొవార్, సమీర్ దిఘే మాత్రమే అప్లై చేసుకున్నారు. పార్థివ్ పటేల్ దరఖాస్తు చేసుకుంటే.. అతడే చీఫ్ సెలక్టర్ గా నియమితులయ్యేవాడు. కానీ, అతడు ఆసక్తి చూపించలేదు. దీంతో ప్రజ్ఞాన్ ఓజా చీఫ్ సెలక్టర్ కావడం ఖాయమే. ఓజాతోపాటు ప్రస్తుతం ఆర్పీ సింగ్, అజయ్ రాత్రా, ఎస్ఎస్ దాస్ సెలక్టర్లుగా ఉన్నారు.

రామోజీ ఫిల్మ్ సిటీలో డ్రాగన్ యాక్షన్

'డ్రాగన్' అవతారంలో అలరించడానికి సన్నద్ధమవుతున్నారు అగ్రహీరో ఎన్టీఆర్. ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ చిత్రాన్ని ప్రశాంత్ నీల్ తెరకెక్కిస్తున్నారు. రుక్మిణీ వసంత్ కథానాయిక. గాయం కారణంగా కొన్ని రోజులుగా ఎన్టీఆర్ షూటింగ్ నుంచి విరామం తీసుకున్నా.. ఈ సినిమా చిత్రీకరణ మాత్రం ఎలాంటి అంతరాయం లేకుండా శరవేగంగా జరుగుతోన్న సంగతి తెలిసిందే. ఇప్పుడాయన గాయం నుంచి కోలుకొని మళ్లీ సెట్లోకి అడుగుపెట్టారు. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన టాకీ పార్ట్ సన్నివేశాల్ని రామోజీ ఫిల్మ్ సిటీలో చిత్రీకరిస్తున్నారు. ఎన్టీఆర్ తో పాటు ఇతర తారాగణంపై ఈ సీక్వెన్స్ ను తెరకెక్కిస్తున్నట్లు చిత్రవర్గాలు తెలిపాయి. ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఇందులో అనిల్ కపూర్, బిజూ మేనన్, ఖుష్బూ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఎన్టీఆర్.. లూగర్ అనే శక్తిమంతమైన పాత్రలో కనిపించనున్న ఈ సినిమా వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు రానుంది.

అప్పుడు రజనీ దత్తపుత్రుడిగా.. ఇప్పుడు అతిథి పాత్రలో: 'జైలర్ 2'లో హృతిక్

సూపర్‌స్టార్ రజనీకాంత్ నటించిన 'జైలర్ 2' అభిమానుల కోలాహలం మధ్య గురువారం విడుదలైంది. తమిళంతో పాటు తెలుగులోనూ ఈ చిత్రానికి మంచి స్పందన వస్తోంది. 'జైలర్'లో లాగే ఇందులోనూ పలువురు ప్రముఖ నటులు అతిథి పాత్రల్లో మెరిశారు. అయితే వారిలో హృతిక్ రోషన్ పాత్ర గురించి ప్రేక్షకులు ప్రత్యేకంగా చర్చించుకుంటున్నారు. దర్శకుడు నెల్సన్ 'రోడీ' పాత్రలో హృతిక్ ను స్టైలిష్ గా చూపించిన విధానం ఆకట్టుకుంటోంది. ఈ నేపథ్యంలోనే రజనీకాంత్ ఫ్యాన్స్ తో పాటు హృతిక్ అభిమానులు 40 ఏళ్ల క్రితం నాటి ఓ సినిమాను గుర్తు చేసుకుంటున్నారు. అదే 1986లో విడుదలైన బాలీవుడ్ చిత్రం 'భగవాన్ దాదా'.

ఈ చిత్రంలో రజనీకాంత్ తో పాటు హృతిక్ తండ్రి రాకేశ్ రోషన్, శ్రీదేవి ప్రధాన పాత్రల్లో నటించారు. అప్పుడు 12 ఏళ్ల వయసున్న హృతిక్ ఆ సినిమాలో రజనీకాంత్ దత్తపుత్రుడిగా కనిపించారు. పలు సన్నివేశాల్లో రజనీతో కలసి సందడి చేశారు. ఆ తరువాత కొన్నేళ్లకు తన తండ్రి తెరకెక్కించిన 'కహోనా ప్యార్ హై'తో కథానాయకుడిగా పరిచయమయ్యారు హృతిక్. అనంతరం క్రిష్, ధూమ్ 2, అగ్నిపథ్ లాంటి చిత్రాలతో స్టార్డమ్ను సొంతం చేసుకున్నారు. మళ్లీ ఇన్నాళ్లకు ఆయన 'జైలర్ 2'లో అతిథి పాత్రలో నటించి సూపర్బార్తో మరోసారి తెరను పంచుకోవడంపై అభిమానులు ఆసక్తిగా చర్చించుకుంటున్నారు. ఆ రెండు సినిమాల్లో రజనీ-హృతిక్ల సన్నివేశాలకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను సామాజిక మాధ్యమాల్లో పంచుకుంటున్నారు.

ఆసియా గేమ్స్ పతక విజేతలతో ముచ్చటించిన ప్రధాని

ఆసియా క్రీడల పతక విజేతలతో భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సంభాషించారు. తన నివాసంలో అథ్లెట్లతో ప్రధాని మోదీ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారిని అభినందించారు. స్వర్ణాలు గెలిచిన భారత హాకీ, క్రికెట్ పురుష, మహిళా జట్లతోపాటు ప్రతి అథ్లెట్ తో మోదీ ఫొటోలు దిగారు. జపాన్ వేదికగా జరిగిన ఆసియా క్రీడల్లో భారత్ 85 పతకాలను గెలిచి తన నాలుగో ప్లేస్ ను కాపాడుకుంది. ఇందులో 21 బంగారు, 27 రజత, 37 కాంస్య పతకాలు ఉన్నాయి.

'డ్యూ డేట్'లో పవర్ ఫుల్ లాయర్గా విలక్షణ నటుడు సునీల్..

హీరోగా, జయశ్రీ హీరోయిన్గా నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'డ్యూ డేట్'. వరిష్ స్టూడియోస్ పతాకంపై పవన్ తరిగోపుల, ఏలూరు శ్రీను నిర్మాతలుగా ఆనంద్.కె. దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం ఇటీవల ఘనంగా పూజా కార్యక్రమాలతో స్టార్ట్ అయింది. ప్రస్తుతం ఈ మూవీ రెగ్యులర్ షూటింగ్ హైదరాబాద్ లో జరుగుతోంది. ఈ షెడ్యూల్లో పలు కీలక సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు. ఇదిలా ఉంటే.. ఇటీవల కమెడియన్ కృష్ణభగవాన్ 'డ్యూ డేట్' షూటింగ్ లో జాయిన్ అయిన సంగతి తెలిసిందే. చాలా కాలం విరామం తరువాత కృష్ణ భగవాన్ ఈ చిత్రంలో ఓ మంచి పాత్రను పోషిస్తున్నాడు. ఇప్పుడు తాజాగా ఈ సినిమా షూటింగ్ లో నటుడు సునీల్ జాయిన్ అయ్యాడు. ఈ చిత్రంలో సునీల్ ఓ లాయర్ పాత్రలో నటిస్తున్నాడు.



ఆయన కెరీర్ లో ఇదొక డిఫరెండ్ పాత్రగా ఎప్పటికీ నిలిచిపోతుంది. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ ఈ చిత్రంలో నటుడు సునీల్ పవర్ ఫుల్ లాయర్ శేఖర్ చంద్రగా కనిపించబోతున్నాడు. ఆయన పాత్ర సినిమా పెద్ద ఎస్సెట్ గా ఉంటుంది. ప్రజెంట్ బర్నింగ్ ఇష్యూ ఆధారంగా అల్లుకున్న ఈ కమర్షియల్ కోర్ట్ రూమ్ డ్రామా ఆద్యంతం ఎంతో ఆసక్తికరంగా ఉత్కంఠభరితంగా ఉంటుంది. ప్రతి మనిషి, ప్రతి నెలా గుర్తుపెట్టుకునే డ్యూ డేట్ చుట్టూ పూర్తి వాణిజ్య అంశాలతో అల్లుకున్న కథ ఇది. ఈ సినిమా ప్రేక్షకులకు ఎంటర్టైన్మెంట్ను అందించడంతో పాటు అందర్ని ఆలోచింపజేస్తుంది. హృదయాలకు హత్తుకుంటుంది' అని చెప్పుకొచ్చారు.

'RC-17' డెన్ రెడీ.. ఎగ్జైటింగ్ అప్డేట్స్ కోసం వేచి ఉండాలంటూ సుకుమార్ పోస్ట్

ఇండస్ట్రీలో ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, డైరెక్టర్ సుకుమార్ కాంబినేషన్ మరోసారి పట్టాలెక్కడానికి సిద్ధమవుతోంది. ఆల్ టైమ్ బ్లాక్ బస్టర్ 'రంగస్థలం' తర్వాత ఈ క్రేజీ కాంబో రిపీట్ అవుతుండటంతో భారీ హైప్ క్రియేట్ అయింది. 'RC 17' వర్కింగ్ టైటిల్ తో రాబోతున్న ఈ సినిమా పూజా కార్యక్రమాలకు సంబంధించిన ముహూర్తంపై గత కొంతకాలంగా రకరకాల పుకార్లు షికార్లు చేస్తూనే ఉన్నాయి.

తాజాగా, ఈ ప్రచారాలకు తెరదించుతూ దర్శకుడు సుకుమార్ స్వయంగా ఈ విషయంపై అదిరిపోయే హింట్ ఇచ్చారు. ఈ క్రేజీ ప్రాజెక్ట్ కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన డెన్ను నేడు ఆయన అధికారికంగా ప్రారంభించారు. త్వరలోనే పూజా కార్యక్రమాలతో ఈ సినిమా అసలు ప్రయాణం మొదలవుతుందని ఆయన స్పష్టం చేశారు. అంతేకాకుండా, త్వరలోనే మోస్ట్ ఎగ్జైటింగ్ అప్డేట్స్ రాబోతున్నాయని, అందరూ వేచి చూడాలని ఫ్యాన్స్ని కోరారు.

పెళ్లి చేసుకునేది పనిమనిషి అవ్వడం కోసం కాదు.. - అనుపమ

యంగ్ హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్ నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'క్రేజీ కల్యాణం'. ఈ సినిమా రిలీజ్కు రాబోతుండగా.. ప్రమోషన్స్లో పాల్గొన్న అనుపమ తన పెళ్లిపై షాకింగ్ కామెంట్స్ చేసింది. 'ఈ సినిమాలో నాకు పెళ్లి అవుతుందా కాదా అనేది పక్కకి పెడితే.. ఇందులో నా పెళ్లిపై చాలా ఒత్తిడి ఉంటుంది. కానీ అలా మా ఇంట్లో నా పెళ్లి గురించి ఏమాత్రం ఒత్తిడి లేదు. నీకు ఇష్టమైనప్పుడు పెళ్లి చేసుకోమనే మా వాళ్లు అంటారు. నాకైతే పెళ్లికి ముందే ఒక బేబిని కనాలనిఉంది. భవిష్యత్తులో నాకు అసలు పెళ్లవుతుందో లేదో నాకే క్లారిటీ లేదు.

కానీ, ఒక పాపనో, బాబునో పెంచుకోవాలనే కోరిక మాత్రం బలంగా ఉంది. అది అడాప్షన్ ద్వారానో లేదా ఐవీఎఫ్ ద్వారానో ఎలాగైనా సాధ్యమే కదా' అంటూ ఓపెన్ అయింది. అలాగే దాంపత్య జీవితంలో భార్యాభర్తల సమానత్వం గురించి మాట్లాడుతూ.. 'పెళ్లి చేసుకునేది ఉచితంగా వచ్చే పనిమనిషి కోసం కాదు. ఆడపిల్లల బాధ్యత కేవలం వంటింటికే పరిమితం కాకూడదు. బయటకు వెళ్లి అలిసిపోయి ఇంటికి వచ్చాక మహిళ ఒక్కతే వంటింట్లోకి వెళ్లి వంట చేయాల్సి రావడం, పురుషులు విశ్రాంతి తీసుకోవడం సరైన పద్ధతి కాదు. ఇంట్లో పనులను ఇద్దరూ సమానంగా పంచుకోవాలి. కనీసం ఆమెకు తోడుగా నిలిచే భాగ్యస్వామ్యం ఉండాలి' అని తన అభిప్రాయాన్ని వ్యక్తపరిచింది.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises D.No.New:3-88, Old : 3-22, Chandra Theatre, Gosala, Penamaluru Mandal, Krishna District,(AP),Pin -521151,
And Published at H.No.23-3-46, 1st Floor, Katamaraju vari Veedhi, Amaravathi Road, Naidupet Guntur(District) AP-522002. EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.APTEL/2016/73939.